http://www.agnidharanews.com

# అగ్నిధార

నిజాల నిప్పు కణిక

మంగళవారం 8 సెప్టెంబర్ 2026

ఎడిటర్: చేగొండ రవి కుమార్ యాదవ్

పేజీలు : 5 వెల : 5/-

Published from Peddapalli Ciculated by Hyderabad, , , Sangareddy, jagityala, Rangareddy, Khammam,Medchal Medak Siddipet, Nalgonda, , warangal, Nizamabad

విలేకరులు కావలెను

ప్రజా గళాన్ని బలంగా వినిపిస్తూ.. అవినీతిపై సమరాన్ని సాగిస్తున్న అగ్నిధార తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల వారికి అవకాశం కలదు. అన్ని జిల్లాలు, డివిజన్లు, మున్సిపల్ మరియు మండల కేంద్రాల్లో విలేకరులు కావలెను.

ఆసక్తి కలిగినవారు సంప్రదించగలరు

సెల్ : 80088 17828



# రణరంగం



అసెంబ్లీ వద్ద తోపులాట..తీవ్ర ఉద్రిక్తత

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పోలీసుల మధ్య వాగ్వాదం

అక్కడే బైఠాయించి బీఆర్ఎస్ నిరసన..నినాదాలు

తోపులాటలో కిందపడిన నేతలు.. జగదీశ్‌రెడ్డికి అస్వస్థత

మహిళా నేతల ఆవేదన.. విలపించిన సునీతా లక్ష్మారెడ్డి

హరీశ్, కేటీఆర్ సహా నేతల అరెస్టు.. తెలంగాణ భవన్‌కు తరలింపు

బీఏసీ సమావేశాన్ని బహిష్కరిస్తున్నట్లు ప్రకటించిన హరీశ్‌రావు

హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీ వర్షాకాల సమావేశాల తొలిరోజే తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డు కోవడం తోపులాటకు దారితీసింది. నేతలు కింద పడిపోవడం, అస్వస్థతకు గురికావడం, నిరసనలు, నినాదాలు, అదుపులోకి తీసుకోవడం వంటి ఘటనలకు దారి తీసింది. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ మండిపడింది. సభలో అడుగు పెట్టక ముందే తమను అడ్డుకుని, తమ పార్టీ సభ్యులపై పోలీసులను అడ్డుపెట్టుకుని ప్రభుత్వం దౌర్జన్యాలకు పాల్పడిందని ఆరోపించింది. పోలీసులు తమపై అనుచితంగా ప్రవర్తించారని, మహిళా ఎమ్మెల్యేల గొంతు పిసికారని, చీరలు లాగారనే ఆరోపణలతో వివాదం మరింత ముదిరింది. ఇది శాసనసభా? కౌరవసభా? అని బీఆర్ఎస్ నిలదీసింది. మరోవైపు పోలీసులతో జరిగిన వాగ్వాదం సందర్భంగా శాసనసభ స్పీకర్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ అధికార పక్షం మండిపడింది. సీఎం రేవంత్‌రెడ్డి శాసనసభలో ఈ మేరకు ప్రకటన చేశారు. సదరు సభ్యుడితో రాజీనామా చేయించి, ప్రతిపక్ష నేత బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ సభ్యులు కూడా బీఆర్ఎస్ ఎమ్మెల్సీపై చర్య తీసుకోవాలని డిమాండ్ చేశారు. అయితే తమపై జరిగిన దాడికి సీఎం రేవంత్‌రెడ్డే బాధ్యత వహించాలని, హోంమంత్రిగానూ వ్యవహరిస్తున్న ఆయనే క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. స్పీకర్ అధ్యక్షతన జరిగిన బీఏసీ సమావేశాన్ని ఆ పార్టీ బహిష్కరించింది. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు నల్ల టీషర్టులు ధరించి అసెంబ్లీకి వెళు_న్న క్రమంలో చోటుచేసుకున్న ఘటనలు అధికార కాంగ్రెస్, విపక్ష - మిగతా3లో

## ఎమ్మెల్యేలను పోలీసులు


# అడ్డుకోవద్దు

- నిబంధనలు ఉల్లంఘిస్తే స్పీకర్ చర్యలు తీసుకుంటారు
- అసెంబ్లీ వద్ద ఎమ్మెల్యేలను అడ్డుకోవడంపై కోర్టును ఆశ్రయించిన బీఆర్ఎస్
- ఎమ్మెల్యేల విధులకు ఆటంకం కలిగించవద్దన్న హైకోర్టు
- అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై నివేదిక ఇవ్వాలని హోంశాఖకు నోటీసులు




హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలోకి వెళ్లకుండా అడ్డుకోవద్దని హైకోర్టు పోలీసును ఆదేశించింది. అసెంబ్లీ నిబంధనలను ఎమ్మెల్యేలు ఉల్లంఘిస్తున్నట్లు స్పీకర్ భావిస్తే, సభాపతిగా ఆయన తగిన చర్యలు తీసుకుంటున్నారని హైకోర్టు పేర్కొంది. అసెంబ్లీలోకి వెళ్లే సమయంలో బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేతో పాటు ఇతర ఎమ్మెల్యేలతో అనుచితంగా ప్రవర్తించిన పోలీసులెవరో గుర్తించి వాళ్లపై కఠిన చర్యలు తీసుకోవాలని డీజీపీని హైకోర్టు ఆదేశించింది. హోంశాఖ జీపీకి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను 21వ తేదీకి వాయిదా వేసింది. - మిగతా3లో



కీలక ప్రతిపాదనలకు

## రక్షణ శాఖ పచ్చజెండా

- రూ.1.10 లక్షల కోట్లతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లు
- రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర
- ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లు
- అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం

## చర్చకు

# మేం సిద్ధం

- అసభ్యకర భాషను వాడిన సభ్యుడిని డిస్మిస్ చేయాలి
- ఇలాంటి వాటిని క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండదన్న ముఖ్యమంత్రి
- ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదని ఆవేదన
- కేసీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్



హైదరాబాద్

స్వతంత్ర భారతంలో సభాపతికి ఇలాంటి అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదని, ఇలాంటి భాష వాడిన సభ్యుడిని డిస్మిస్ చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్? ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను ఖండించే అంశంపై సభలో చర్చ జరిగింది. తాను అన్ని సభలను చూశానని, కానీ ఇంత అభ్యంతరకర భాషను వాడటం ఎప్పుడూ చూడలేదన్నారు. ఇలాంటి వాటిని క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండదని ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. అసభ్యకర భాషను వాడిన సభ్యుడి చేత కేసీఆర్ రాజీనామా చేయించాలని సీఎం డిమాండ్ చేశారు. వాయిదా అనంతరం శాసనసభ ప్రారంభమైన తరువాత స్పీకర్‌కు - మిగతా3లో

## తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర

- ఎస్ఐఆర్‌ను ఆయుధంగా చేసుకుని బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారన్న రేవంత్ రెడ్డి
- తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ నోరెత్తడం లేదని వ్యాఖ్య
- సీపీఎం నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణసభలో సీఎం



ప్రైవేటు రంగానికి

## ప్రోత్సాహం

- ఇస్రో ఒక్కటే అది చేయలేదు
- కచ్చితంగా ప్రైవేటు భాగస్వామ్యం అవసరం
- భారత అంతరిక్ష రంగాన్ని విస్తరించడంలో పరిశ్రమల పాత్ర పెరగాలి
- ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ కీలక వ్యాఖ్యలు

## ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది


- ద్రవ్యోల్బణం పండుగల ఆనందాన్ని దెబ్బతీస్తోంది : కాంగ్రెస్
- మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోందని జైరాం రమేశ్ ఫైర్



## ఎస్ఐఆర్ గడువు

# పొడిగింపు

- నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురణ
- రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువు పొడిగింపునకు ఈసీ నిర్ణయం
- క్లెయిమ్‌లు, అభ్యంతరాల గడువు అక్టోబర్ 7 వరకు పొడిగింపు
- నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురణ




హైదరాబాద్

రాష్ట్రంలో ఎస్ఐఆర్ గడువు పొడిగిస్తూ ఎన్నికల సంఘం నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ విజ్ఞప్తితో గడువు పొడిగించింది. దీంతో క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ కోసం అక్టోబర్ 7 వరకు అవకాశం ఉంటుంది. నవంబర్ 9న తుది ఓటరు జాబితా ప్రచురిస్తారు. ప్రస్తుతం పరిస్థితుల్లో ఓటర్లు, అధికారులకు ఇదో పెద్ద ఉపసమనంగా భావించాలి. మొదటి నుంచి గందరగోళంగానే : తెలంగాణలో ఓటర్ల జాబితా - మిగతా3లో

# కీలక ప్రతిపాదనలకు రక్షణ శాఖ పచ్చజెండా

దేశ త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయాలు తీసుకుంది. ఏకంగా 1.10 లక్షల కోట్ల రూపాయల వ్యయంతో ఆయుధాలు, సైనిక పరికరాల కొనుగోళ్లకు పచ్చజెండా ఊపింది. ఈ మేరకు రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ పలు కీలక ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదం తెలిపింది. 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి అనుగుణంగా ఆమోదం పొందిన ప్రతిపాదనల్లో 98 శాతం దేశీయ రక్షణ రంగ సంస్థల నుంచే కొనుగోళ్లు చేయనున్నట్లు స్పష్టం చేసింది.



**రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ఆమోదముద్ర**

సాయుధ దళాల ఆధునీకరణే లక్ష్యంగా ఈ ఏడాదిని 'సంస్కరణల సంవత్సరం'గా ప్రకటించిన రక్షణశాఖ త్రివిధ దళాల బలోపేతానికి కీలక నిర్ణయాలు తీసుకుంది. ఎలాంటి పరిస్థితులనైనా దీటుగా ఎదుర్కొనేందుకు వీలుగా సైన్యానికి అవసరమైన ఆయుధ పరికరాల సేకరణకు పచ్చజెండా ఊపింది. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన డిఫెన్స్ అక్విజిషన్ కౌన్సిల్ ఏకంగా రూ. 1.10 లక్షల కోట్ల విలువైన ఆయుధ సంపత్తి కొనుగోళ్ల ప్రతిపాదనలకు ప్రాథమిక ఆమోదముద్ర వేసింది.

డీఏసీ ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యానికి అవసరమైన కెమికల్, బయోలాజికల్, రేడియోలాజికల్, న్యూక్లియర్ రెక్కీ వాహనాలు ఉన్నాయి. ఈ వాహనాలు కలుషితమైన ప్రాంతాలను గుర్తించి, పర్యవేక్షించడంతో పాటు మార్కింగ్ చేయడంలో కీలకపాత్ర పోషిస్తాయి. అత్యంత క్లిష్టమైన సరిహద్దు భూభాగాల్లో దళాల వేగవంతమైన కదలికలు, లాజిస్టిక్స్, ఆపరేషనల్ సపోర్ట్ కోసం హై మొబిలిటీ వెహికల్స్ కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రువులకు ముకుతాడు వేసేలా సవాలుతో కూడిన ప్రాంతాల్లో అత్యంత వేగంగా, సమర్థవంతంగా మందుపాతరలను అమర్చేందుకు సెల్ఫ్-ప్రొపెల్డ్ మెకానికల్ మైన్ లేయర్స్ కొనుగోలుకు సైతం ఆమోదముద్ర వేసింది. యుద్ధ సమయాల్లో క్లిష్టమైన భౌగోళిక ప్రాంతాల్లో అత్యంత సంక్లిష్టమైన మిషన్లలో కీలకంగా వ్యవహరించే అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, సర్వత్ర బ్రిడ్జ్ సిస్టమ్, అడ్వాన్స్‌డ్ లైట్ హెలికాప్టర్ల కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది.

**ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లు**

భారత నావికాదళం కోసం 'ఆరుద్ర' రాడార్లతో పాటు మెరైన్ గ్యాస్ టర్బైన్ల రూపకల్పన, అభివృద్ధి, కొనుగోలుకు డీఏసీ ఆమోదం తెలిపింది. వివిధ నావల్ ఎయిర్ స్టేషన్లలో ప్రస్తుతం ఉన్న ఎయిర్ రూట్ సర్వైలెన్స్ రాడార్ల స్థానంలో ఈ అత్యాధునిక ఆరుద్ర రాడార్లను ప్రవేశపెట్టనున్నారు. యుద్ధనౌకలకు ఇంధన సిస్టమ్‌గా పనిచేసే మెరైన్ గ్యాస్ టర్బైన్ల కొనుగోలుతో ఇంజిన్ల విషయంలో విదేశీ సంస్థలపైన ఆధారపడటం తగ్గుతుందని రక్షణ శాఖ స్పష్టం చేసింది.

**98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరణ**

భారత వాయుసేనకు చెందిన ఫైటర్ జెట్లు, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంచే పలు ప్రతిపాదనలకు సైతం డీఏసీ ఆమోదం తెలిపింది. శత్రుదేశాల నిఘా రాడార్లను సమర్థంగా అడ్డుకునే గ్రౌండ్-బేస్డ్ మల్టీ-పర్పస్ జామర్ల కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణ వ్యవస్థల భద్రతను డిజిటలైజ్ చేస్తూ 'డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్' వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు డీఏసీ అంగీకారం తెలిపింది. దీని ద్వారా దళాల్లో ఇప్పటివరకు ఉన్న పాత పేపర్ గుర్తింపు కార్డులు, పాస్‌లు, పర్మిట్ల స్థానంలో పరస్పరం పనిచేసే అత్యాధునిక స్మార్ట్ కార్డులను అమలు చేయనున్నారు. ఈ కొనుగోలులో 98 శాతం దేశీయ పరిశ్రమల నుంచే సేకరించనున్నట్లు రక్షణ శాఖ స్పష్టం చేసింది. తద్వారా 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యానికి మరింత ఊతమిస్తుందని వెల్లడించింది.

# ప్రైవేటు రంగానికి ప్రోత్సాహం

భారత అంతరిక్ష రంగాన్ని విస్తరించేందుకు మన దేశీయ పరిశ్రమలు, స్టార్టప్‌లు, విద్యాసంస్థల భాగస్వామ్యం మరింత పెరగాలని ఇస్రో ఛైర్మన్ వి.నారాయణన్ పిలుపునిచ్చారు. ఉపగ్రహాలకు, ప్రయోగాలకు పెరుగుతున్న డిమాండ్‌ను కేవలం ఇస్రో ఒక్కటే తీర్చలేదు అని ఆయన నొక్కి చెప్పారు. నేడు ప్రైవేటు రంగ భాగస్వామ్యం, సాంకేతిక పురోగతి, ప్రతిష్ఠాత్మక మిషన్లు, అంతర్జాతీయ సహకారంతో కూడిన కొత్త దశలోకి భారత అంతరిక్ష కార్యక్రమం అడుగుపెడుతోందని వి.నారాయణన్ పేర్కొన్నారు. బెంగళూరు స్పేస్ ఎక్స్‌పో 2026 (9వ ఎడిషన్)లో ప్రసంగిస్తూ ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు.



"ప్రస్తుతం అంతరిక్షంలో మనకు సంబంధించిన అసెట్స్? (ఉపగ్రహాలు) 56 మాత్రమే ఉన్నాయి. కానీ మన అవసరాలు తీర్చేందుకు ఇంకా చాలా ఉపగ్రహాలు కావాల్సి ఉంది. రానున్న 6-7 ఏళ్లలో కనీసం 200 నుంచి 300 ఉపగ్రహాలను తయారు చేసి ప్రయోగించాల్సి ఉంది. ఈ పనిని కేవలం ఇస్రో మాత్రమే చేయలేదు."

ప్రైవేటు రంగాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం సంస్కరణలను తీసుకువచ్చిందని ఇస్రో ఛైర్మన్ పేర్కొన్నారు. ఇందులో భాగంగా ప్రైవేటు అంతరిక్ష కార్యకలాపాలకు అనుమతులు ఇవ్వడానికి ఇన్?-స్పేస్? (×చీ-ౄూూజవ) సంస్థ పనిచేస్తోందన్నారు. అలాగే వాణిజ్య పురోగతికి మద్దతు ఇవ్వడంలో 'న్యూ స్పేస్ ఇండియా లిమిటెడ్? ' (ఎన్?ఎస్?ఐఎల్?) కీలక పాత్ర పోషిస్తోందని అన్నారు. భారత అంతరిక్ష రంగానికి దేశీయ పరిశ్రమలు అందిస్తున్న సహకారాన్ని నారాయణన్? కొనియాడారు. ఒక రాకెట్ ప్రయోగానికి అయ్యే బడ్జెట్లో దాదాపు 80 శాతం నిధులు భారతీయ పరిశ్రమలకే వెళ్తాయని ఆయన గుర్తు చేశారు. "పీఎస్?ఎల్?వీ, జీఎస్?ఎల్?వీ, ఎల్?వీఎం3 లాంటివాటి తయారీకి అయ్యే బడ్జెట్లో 80 శాతం భారతీయ పరిశ్రమలకే వెళ్తుందని మీరు అర్థం చేసుకోవాలి. భారత అంతరిక్ష కార్యక్రమం సాధిస్తున్న విజయం వెనుక మన దేశీయ పరిశ్రమలు, విద్యాసంస్థల భాగస్వామ్యం ఉందని మీరు గుర్తించాలి" అని ఆయన అన్నారు.

**ఎక్కువ ప్రయోగాలు చేయాల్సిందే!**

ప్రస్తుతం మన దేశంలో అంతరిక్ష రంగానికి సంబంధించి దాదాపు 450 స్టార్టప్? కంపెనీలు పనిచేస్తున్నాయని వి.నారాయణన్? పేర్కొన్నారు. ప్రస్తుతం దేశీయ స్టార్టప్ వ్యవస్థ ఎంతో బలంగా ఎదుగుతోందని ఆయన అభిప్రాయపడ్డారు. అయితే భారతదేశం తన అంతరిక్ష లక్ష్యాలను చేరుకోవాలంటే, రాకెట్ ప్రయోగాల సంఖ్యను గణనీయంగా పెంచాల్సి ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. 'నేను 1984లో ఇస్రోలో చేరినప్పుడు, మూడేళ్లకు ఒకసారి లేదా రెండేళ్లకు ఒకసారి రాకెట్ ప్రయోగించేవాళ్లం. కానీ ఇప్పుడు నెలకొక ప్రయోగం చేస్తున్నాం. అయితే ఇది సరిపోదు. మనం ఏడాదికి దాదాపు 50 ప్రయోగాలు చేయాల్సిన అవసరం ఉంది. కాబట్టి మనమంతా కలిసికట్టుగా పనిచేయాలి' అని ఆయన పిలుపునిచ్చారు.

**ప్రైవేటు రంగం భేష్?!**

ఇన్-స్పేస్? ఛైర్మన్? పవన్? గోయెంకా భారత్?లో ప్రైవేటు సంస్థలు అంతరిక్ష రంగంలో సాధిస్తున్న వేగవంతమైన పురోగతిని వివరించారు. 2014లో కేవలం ఒకే ఒక స్పేస్ స్టార్టప్? ఉంటే, ఇప్పుడు ఆ సంఖ్య 450 దాటిందని ఆయన అన్నారు. ఈ ఒక్క సంవత్సరంలోనే ప్రైవేటు రంగం నుంచి 160 మిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు వచ్చాయని ఆయన తెలిపారు. ఇస్రో, ప్రైవేటు పరిశ్రమలు, ఇన్?-స్పేస్? మధ్య పెరుగుతున్న భాగస్వామ్యానికి 'స్కైరూట్? ఏరోస్పేస్?' ఒక మంచి ఉదాహరణ అని గోయెంకా పేర్కొన్నారు. ఈ సంస్థ భారతదేశపు మొదటి ప్రైవేటను రాకెట్?ను అభివృద్ధి చేసి, కక్ష్యలోకి ఉపగ్రహాన్ని పంపే సామర్థ్యాన్ని సాధించిందని ఆయన గుర్తు చేశారు.

"ఈ భాగస్వామ్యమే భారతదేశానికి ఉన్న అసలైన బలం. 6 దశాబ్దాల ఇస్రో అనుభవం, నేడు ప్రైవేట్ రంగంతో చేతులు కలిపింది. ఇస్రో, ప్రైవేట్ సంస్థలు కలిసికట్టుగా ఎదుగుతున్నాయి. ఇస్రో, ఇన్?-స్పేస్?, ఎన్?ఎస్?ఐఎల్?, ప్రైవేటు కంపెనీలు, ఎంఎస్?ఎంఈలు, విద్యాసంస్థలు, పెట్టుబడిదారులతో కూడిన ఒక పూర్తి స్థాయి అంతరిక్ష ఆర్థిక వ్యవస్థను భారత్? నిర్మిస్తోంది" అని పవన్? గోయెంకా తెలిపారు. భారత కంపెనీలు తమ సేవల విలువను మరింత పెంచుకుంటూ, ప్రపంచ అవసరాలను తీర్చాలని కోరారు. అలాగే అంతర్జాతీయ కంపెనీలు భారతదేశాన్ని ఒక తయారీ, సాంకేతిక అభివృద్ధి, అంతరిక్ష భాగస్వామ్యాలకు ఒక ప్రధాన కేంద్రంగా చూడాలని ఆయన కోరారు.

# ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉంది



నిత్యావసరాల ధరల పెరుగుదల వేళ కేంద్రంలోని మోదీ సర్కార్‌పై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ద్రవ్యోల్బణం 'హై-వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోందని విమర్శించింది. ప్రభుత్వం 'అంకెల గారడీ'తో బిజీగా ఉందని ఆరోపించింది. ఈ మేరకు కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్? వ్యాఖ్యానించారు. పండుగ షాపింగ్ సీజన్ ప్రారంభం కాకముందే పెరుగుతున్న ధరలు గృహ బడ్జెట్లపై భారం మోపాయని పేర్కొన్న ఒక మీడియా నివేదిక స్క్రీన్‌షాట్‌ను ఆయన ఎక్స్‌లో షేర్ చేశారు.

"ద్రవ్యోల్బణం 'హై వోల్టేజ్ షాక్' ఇప్పుడు పండుగల ఆనందాన్ని తీవ్రంగా దెబ్బతీస్తోంది. మోదీ ప్రభుత్వం ప్రతి వారం ద్రవ్యోల్బణంతో ప్రజల జేబులు కొడుతోంది. కేవలం మూడు వారాల్లోనే ఉల్లిపాయల ధరలు రెట్టింపు అయ్యాయి. చక్కెర ధర 25 శాతం పెరిగింది. కందిపప్పు, మినుములు, ఆవాలు, రిఫైన్?డ్ ఆయిల్ ధరలు కూడా పెరిగాయి. దీపావళికి ముందే బాదం, జీడిపప్పు, పిస్తా, ఎండుద్రాక్ష, వాల్‌నట్‌లు కూడా ఖరీదయ్యాయి. పాలు, చక్కెర ధరలు పెరగడంతో స్వీట్ల ధరలు కూడా నిరంతరం పెరుగుతున్నాయి. నెయ్యి, మసాలాల ధరలు కూడా పెరుగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే వంటగది, పండుగలు ఖరీదైనవిగా మారాయి. గృహ బడ్జెట్ ఇబ్బందుల్లో పడింది. ప్రజల జేబులపై పడుతున్న ఈ భారం మోదీ ప్రభుత్వానికి కనిపించడం లేదు. ద్రవ్యోల్బణాన్ని అదుపు చేయకుండా, ప్రభుత్వం గణాంకాల గారడీతో దాని ప్రభావాన్ని దాచడంలో నిమగ్నమైంది. మోదీ గణాంకాల గారడీ ద్రవ్యోల్బణం ప్రభావాన్ని దాచలేరు. ప్రజలు ప్రతీదీ గమనిస్తున్నారు."

పెరుగుతున్న ధరల రూపంలో దేశానికి "హై వోల్టేజ్ షాక్" ఇస్తోందని కేంద్రంపై కాంగ్రెస్ ఇప్పటికే తీవ్ర విమర్శలు గుప్పించింది. అలాగే "అహంకారపూరిత" మోదీ ప్రభుత్వం "గణాంకాల గారడీ"తో ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తోందని పేర్కొంది. ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో నమోదైన 7.8 శాతం జీడీపీ (+ఖూ) వృద్ధి రేటు "ఆర్థిక పునరుజ్జీవనానికి సంకేతం" కాదని ఆ పార్టీ తెలిపింది.

**పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా జాప్యంపై కాంగ్రెస్ ఫైర్**

మరోవైపు పార్లమెంట్ వర్షాకాల సమావేశాలను వాయిదా వేయడంలో జాప్యంపై కాంగ్రెస్ సోమవారం ప్రశ్నించింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదించడానికే హోం మంత్రి అమిత్ షా సభలను వాయిదా వేయకుండా జాప్యం చేస్తున్నారని ఆరోపించింది. కాంగ్రెస్ కమ్యూనికేషన్స్ ఇన్‌చార్జ్ జనరల్ సెక్రటరీ జైరామ్ రమేశ్? ఈ మేరకు ఎక్స్? వేదికగా పోస్ట్ చేశారు. "పార్లమెంటును నిరవధికంగా వాయిదా వేసి నేటికి సరిగ్గా 25 రోజులు అయ్యింది. కానీ దానిని ఇంకా ప్రొరోగ్ చేయలేదు. సాధారణంగా నిరవధిక వాయిదా వేసిన 3-4 రోజుల తర్వాత ప్రొరోగేషన్ జరుగుతుంది. కానీ 2015 వర్షాకాల సమావేశాల్లో ఇది 28 రోజుల వ్యవధి ఉంది. లలిత్ మోదీ అంశంపై ఆందోళనలతో ఆ సమావేశాలు దాదాపు పూర్తిగా రద్దయ్యాయి. కానీ మోదీ ప్రభుత్వం జీఎస్టీ బిల్లులను బలవంతంగా ఆమోదింపజేయాలనే ఆశతో సమావేశాలను కొనసాగించింది. దానికి రాజ్యసభలో మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరం, కానీ అది వారికి లేదు. చివరికి, మోదీ ప్రభుత్వం ప్రతిపక్షాలతో మరింత అర్థవంతంగా సంప్రదించి చాలా ఆలస్యంగా బిల్లులను ఆమోదించాల్సి వచ్చింది. డీలిమిటేషన్ బిల్లులను ఆమోదం కోసం హోం మంత్రి ఇప్పటికీ లోక్‌సభలో తనకు ఇష్టమైన మూడింట రెండు వంతుల మెజారిటీ కోసం నానా తంటాలు పడుతుండటంతో 2026 వర్షాకాల సమావేశాలు వెంటిలేటర్‌పై ఉన్నాయి. ఆయన బెదిరింపులు, భయపెట్టే రాజకీయాలు హద్దులు దాటాయన్న వాస్తవాన్ని అంగీకరించడానికి ఇంకెంత కాలం పడుతుంది?" అని జైరాం రమేశ్? అన్నారు.

## మోదీ సభ కోసం తొలిసారి 'బుక్ మైషో'లో రిజిస్ట్రేషన్



భారత ప్రధాని నరేంద్ర మోదీ సెప్టెంబర్ 8న గుజరాత్‌లోని వడోదరలో పాల్గొననున్న కార్యక్రమానికి ప్రజల నుంచి ముందుగానే విశేష స్పందన వచ్చింది. తొలిసారిగా ప్రధాని కార్యక్రమానికి 'బుక్ మైషో' ద్వారా ఉచిత ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేపట్టారు. దీంతో రిజిస్ట్రేషన్ ప్రారంభమైన గంటలోపే అందుబాటులో ఉన్న సీట్లన్నీ బుక్ అయిపోయాయి. ఆ తర్వాత కూడా భారీ సంఖ్యలో ప్రజలు రిజిస్ట్రేషన్ కోసం ప్రయత్నించడంతో 42,000 మందికి పైగా వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్నారు. ఈ సీట్ల బుకింగ్ తీరు మోదీ కార్యక్రమం పట్ల ప్రజలకు ఉన్న అపారమైన ఉత్సాహాన్ని ప్రతిబింబిస్తోంది. నరేంద్ర మోదీ మంగళవారం వడోదరలో పర్యటించనున్నారు. నగరంలో రూ.35,000 కోట్లకు పైగా విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టనున్నారు. కొన్ని ప్రాజెక్టులకు శంకుస్థాపన చేయనున్నారు. ఇంకొన్ని అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించి జాతికి అంకితం చేయనున్నారు. అనంతరం సభను ఉద్దేశించి ప్రసంగిస్తారు. మోదీ ప్రోగ్రామ్ సీట్ల రిజిస్ట్రేషన్ కోసం తొలిసారి వడోదర మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) బుక్ మైషోను ఉపయోగించింది. దీంతో ప్రధాని సభకు భారీగా స్పందన రావడం గమనార్హం.

## 'నవంబర్ 30 కల్లా నివేదిక సమర్పించాల్సిందే'

**ఆరావళిపై కమిటీకి సుప్రీంకోర్టు డెడ్‌లైన్**

**ఆరు నెలల గడువు కోరిన హైపవర్ కమిటీ**

**నవంబర్ 30లోగా తుది నివేదిక ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశం**

**ఆలస్యం చేస్తే కమిటీని పూర్తిగా పునర్వ్యవస్థీకరిస్తామని హెచ్చరిక**




ఆరావళి పర్వత శ్రేణి పరిధి, నిర్వచనం, పరిరక్షణకు సంబంధించిన తుది నివేదికపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. నివేదిక సమర్పించేందుకు మరో ఆరు నెలల గడువు కావాలని హైపవర్ కమిటీ చేసిన విజ్ఞప్తిని తిరస్కరించింది. నవంబర్ 30లోగా తుది నివేదికను సమర్పించాలని డెడ్‌లైన్ విధించింది. గడువులోగా నివేదిక ఇవ్వడంలో విఫలమైతే మొత్తం కమిటీని రద్దు చేసి కొత్త కమిటీ ఏర్పాటు చేస్తామని హెచ్చరించింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, దాని పరిధి, పర్యావరణ పరిరక్షణ, ముఖ్యంగా మైనింగ్ కార్యకలాపాల నియంత్రణకు సంబంధించి సుప్రీంకోర్టు కొన్ని నెలల క్రితం కమిటీని ఏర్పాటు చేసింది. ఆరావళి ప్రాంతాన్ని ఏ విధంగా గుర్తించాలి? ఏ ప్రాంతాలను రక్షణ పరిధిలోకి తీసుకురావాలి? మైనింగ్‌పై ఎలాంటి నియంత్రణలు ఉండాలి? అనే అంశాలపై కమిటీ ప్రస్తుతం అధ్యయనం చేస్తోంది. తుది నివేదిక సమర్పించేందుకు కమిటీకి గతంలో ఇచ్చిన గడువు ఆగస్టు 31తో ముగిసింది. అయితే ఆ అంశంపై సమగ్రంగా, భవిష్యత్తులో కూడా సమర్థించగలిగే విధంగా నివేదిక సిద్ధం చేయాలంటే మరింత సమయం అవసరమని కమిటీ పేర్కొంది. అందులో భాగంగా మరో ఆరు నెలల గడువు ఇవ్వాలని సుప్రీంకోర్టును కోరింది. అంటే వచ్చే ఏడాది ఫిబ్రవరి 28 వరకు సమయం ఇవ్వాలని విజ్ఞప్తి చేసింది. అయితే ఆ అభ్యర్థనపై అత్యున్నత న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జాయ్‌మాల్య బాగ్చీ, వి. మోహనలతో కూడిన ధర్మాసనం సోమవారం ఆ వ్యవహారాన్ని విచారించింది. కమిటీ కోరిన ఆరు నెలల గడువును ఇవ్వడానికి నిరాకరించింది. ఆరావళి అంశాన్ని మరింత కాలం వాయిదా వేయడం సరికాదని స్పష్టం చేసింది.

**'రాత్రింబవళ్లు పనిచేయండి'**

కమిటీ అవసరమైతే రాత్రింబవళ్లు పనిచేసి నివేదిక సిద్ధం చేయాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ సూచించారు. నవంబర్ 30వ తేదీలోగా తుది నివేదికను సమర్పించాలని ఆదేశించారు. రెండు నెలల సమయంలో నివేదిక ఇవ్వలేకపోతే ప్రస్తుత కమిటీని పూర్తిగా రద్దు చేసి కొత్త కమిటీని ఏర్పాటు చేస్తామని హెచ్చరించారు. ఆరావళి అంశం ప్రాధాన్యాన్ని దృష్టిలో పెట్టుకుని వ్యవహారాన్ని ఇకపై పెండింగ్‌లో ఉంచలేమన్న సంకేతాన్ని కోర్టు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్రం తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య భాటి వాదనలు వినిపించారు. ఇప్పటికే ఒక మధ్యంతర నివేదిక సిద్ధమైందని కోర్టుకు తెలిపారు. అయితే దీనిపై స్పందించిన ప్రధాన న్యాయమూర్తి, మధ్యంతర నివేదిక కాకుండా తుది నివేదిక సమర్పించాలని స్పష్టం చేశారు. ఆరావళి ప్రాంతంలోని అన్ని వర్గాల అభిప్రాయాలను పూర్తిస్థాయిలో తెలుసుకోవాల్సి ఉందని వివరించారు. ముఖ్యంగా ప్రభావిత వర్గాలకు తగినంత సమయం ఇచ్చి వారి అభిప్రాయాలను నమోదు చేయాల్సిన అవసరం ఉందని, మరింత సమయం అవసరమవుతుందని కోర్టుకు చెప్పారు.

**'గిరిజనుల అభిప్రాయాలు తీసుకోవాలి'**

అయితే రాజస్థాన్, గుజరాత్‌లలోని గిరిజన సమాజాలతో పాటు ఆరావళి ప్రాంతానికి సంబంధించిన అన్ని వర్గాల అభిప్రాయాలను కమిటీ తీసుకోవాలని సుప్రీంకోర్టు సూచించింది. అవసరమైతే అత్యవసర అంశాలపై విడివిడిగా మధ్యంతర నివేదికలను కూడా సమర్పించవచ్చని తెలిపింది. తద్వారా అత్యవసరంగా పరిష్కరించాల్సిన అంశాలపై కోర్టు విడిగా నిర్ణయం తీసుకునే అవకాశం ఉంటుందని స్పష్టం చేసింది. ఆరావళి పర్వత శ్రేణి నిర్వచనం, మైనింగ్ నియంత్రణపై గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో వివాదం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. 2025 నవంబర్ 20న అప్పటి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఆరావళి కొండలు, పర్వత శ్రేణికి ఎత్తు ఆధారిత నిర్వచనాన్ని ఆమోదించింది. స్థానిక భూభాగం నుంచి 100 మీటర్ల ఎత్తు ఉన్న భౌగోళిక ఆకృతులను ఆరావళి కొండలుగా పరిగణించాలని నిర్ణయించింది. అలాగే 500 మీటర్ల పరిధిలో ఉన్న రెండు లేదా అంతకంటే ఎక్కువ కొండలను ఆరావళి శ్రేణిగా పరిగణించేలా నిర్వచనం ఇచ్చింది. ఆ నిర్వచనంపై తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కొత్త ప్రమాణాల వల్ల ఆరావళి ప్రాంతంలో పెద్ద భాగం రక్షణ పరిధి నుంచి బయటపడే అవకాశం ఉందని పర్యావరణవేత్తలు, ఇతర వర్గాలు ఆందోళన వ్యక్తం చేశాయి. దీంతో మైనింగ్ కార్యకలాపాలు పెరిగే ప్రమాదం ఉందన్న విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో సుప్రీంకోర్టు గత డిసెంబర్‌లో ఆ తీర్పును రద్దు చేసింది. పాత కమిటీ సిఫార్సులను అమలులో లేకుండా చేసింది. ఆరావళి పర్యావరణ వ్యవస్థపై సమగ్రంగా అధ్యయనం చేసి, శాస్త్రీయ ఆధారాలతో కొత్త నిర్వచనాన్ని సూచించేందుకు కొత్త కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ నివేదిక సమర్పించిన తర్వాత డిసెంబర్ 2న ఆ కేసును సుప్రీంకోర్టు మరోసారి విచారించనుంది.

# తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర

ఎస్ఐఆర్‌ను ఆయుధంగా చేసుకుని తెలంగాణ రాష్ట్రంలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఈ విషయంలో అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఏకమై మోదీ సర్కారుపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ ఉపాధ్యక్షుడు, సీపీఎం సీనియర్ నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతూ బీజేపీ, బీఆర్ఎస్‌లపై విమర్శలు చేశారు.

**పేదలు, గిరిజనులు ఓట్లు తొలగించే కుట్ర**

రాష్ట్రంలో పేదలు, గిరిజనుల ఓట్లు తొలగించే కుట్ర జరుగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. కొడంగల్ నుంచి వలస వెళ్లిన వేల మంది పేదల ఓట్లను ఈసీ తొలగిస్తోందని ఆరోపించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీ వ్యతిరేకుల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆక్షేపించారు. తెలంగాణలో కోటి ఓట్లు(33 శాతం) తొలగిస్తున్నప్పటికీ బీఆర్ఎస్ నోరెత్తకపోవడాన్ని తప్పుపట్టారు. కమ్యూనిస్టులు, కాంగ్రెస్ ఏకమై మోదీ ప్రభుత్వంపై పోరాటం చేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. వారి(కమ్యూనిస్టుల) సహకారంతోనే హస్తం పార్టీ చేసిన పోరాటాల వల్ల మోదీ నల్లచట్టాలను వెనక్కు తీసుకున్నారని రేవంత్ రెడ్డి గుర్తుచేశారు. ఇవాళ్టి ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని రేవంత్ రెడ్డి అన్నారు. ఓట్ల తొలగింపుపై అంతా అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఎర్రజెండాను చూస్తే పేదోడికి ఒక నమ్మకం అని రేవంత్ రెడ్డి అన్నారు. దేశానికి మోదీ అత్యంత ప్రమాదకరమైన వ్యక్తి అని అన్నారు. ఆయన ఓటమే కమ్యూనిస్టుల గెలుపు అని వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టులు లేవనెత్తే సహేతుకమైన సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డి పేరు రైతులకు సంబంధించిన ఏదైనా సంస్థకు పెడతామని రేవంత్ రెడ్డి వటటల్లడించారు.

"తెలంగాణలో సర్ ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్‌కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది. ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేది ఎస్ఐఆర్'



సారంపల్లి అంటే నాకు అపారమైన గౌరవం : వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు. సారంపల్లి మల్లారెడ్డిని తక్కువసార్లే కలిసినప్పటికీ, ఆయన అంటే అపారమైన గౌరవం ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కమ్యూనిస్టుల పోరాటాలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వ చ్చేందుకు ఉపయోగపడ్డాయని చెప్పారు. దున్నేవాడితే భూమి అంటూ ఎన్నో రైతు సమస్యలపై కమ్యూనిస్టులు పోరాడారని రేవంత్ రెడ్డి కొనియాడారు. కమ్యూనిస్టులు అంటే తనకు పరోక్షంగా చాలా అభిమానమని వివరించారు. అసైన్డ్?, పోడు పట్టాలు దక్కాయంటే పోరాటం కమ్యూనిస్టులది, పరిష్కారం కాంగ్రెస్?దని వివరించారు. వారి ఉద్యమాల ఫలితంగానే కాంగ్రెస్ అనేక చట్టాలు తెచ్చిందని గుర్తుచేశారు.

# ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవద్దు

-మొదటిపేజీ తరువాయి

అసెంబ్లీలోకి ప్రవేశించే సమయంలో పోలీసులు అడ్డుకున్నారంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హైకోర్టులో లంచ్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ టి.మాధవీ దేవీ విచారణ చేపట్టారు. పోలీసులు అడ్డుకోవడంతోపాటు దాడి చేశారని పిటీషనర్ల తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. ఈ దాడిలో పలువురు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు గాయపడ్డారన్నారు. ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి పట్ల అనుచితంగా ప్రవర్తించారని కోర్టుకు తెలిపారు అసెంబ్లీలోకి ఎమ్మెల్యేలు ఎలాంటి ప్లకార్డు లేదా దుస్తులపై రాతలు రాసుకొని వెళ్లకూడదనే నిబంధనలున్నాయని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నలుపు రంగు టీషర్ట్?లపై కొన్ని రాతలతో వెళ్తున్న కారణంగానే పోలీసులు అడ్డుకున్నారని హోంశాఖ జీపీ మహేశ్ రాజే కోర్టుకు తెలిపారు. దీనికి సంబంధించి మరిన్ని వివరాలను పోలీసుల నుంచి తెలుసుకోవడానికి సమయం కావాలని హోంశాఖ జీపీ కోరారు. ఇరువైపుల వాదనలు విన్న హైకోర్టు, అసెంబ్లీలోకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదావేసింది.

**తొలిరోజు ఉద్రిక్త వాతావరణం :**

తెలంగాణ శాసనసభ వర్షాకాల ప్రారంభం రోజునే తీవ్ర ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయిందని ఆరోపిస్తూ ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ సభ్యులు నల్ల టీషర్ట్?లతో అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్నారు. దీంతోపాటు హామీలు అమలు సహా ఇతర సమస్యలపై బీజేపీ, ఆమ్ ఆద్మీ పార్టీలు అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చాయి. దీంతో అసెంబ్లీ ప్రధాన ద్వారం వద్ద ఉద్రిక్త వాతావరణ నెలకొంది. అసెంబ్లీ గేటు వద్దకు రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఉన్న నినాదాలు రాసి ఉన్న టీషర్ట్?లు, ప్లకార్డులను పట్టుకొని బీఆర్?ఎస్? సభ్యులు రావడంతో పోలీసులు వారిని నిలువరించారు. దీనిపై హరీశ్?రావు సహా




ఇతర భారత రాష్ట్ర సమితి శాసనసభ్యులు పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం టీషర్ట్?లు విప్పేసి, బనియన్లతో నిరసన తెలిపారు. ఈ క్రమంలో పోలీసులు, బీఆర్?ఎస్? ప్రజాప్రతినిధుల మధ్య వాగ్వాదం, తోపులాట చోటుచేసుకున్నాయి. మాజీమంత్రి జగదీష్?రెడ్డి స్పృహ కోల్పోగా, కేటీఆర్, హరీశ్ సహా మరికొంత మందికి గాయాలయ్యాయి.

**కన్నీరుపెట్టిన బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యే :**

ఇదే సమయంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు పోలీసులను దాటుకొని అసెంబ్లీ లోపలికి వెళ్లేందుకు ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు మధును బలవంతంగా నిగ్రహించారు. ఆగ్రహంతో ఊగిపోయిన మధు అనుచిత వ్యాఖ్యలు చేశారు. ఈ ఘర్షణలో పోలీసులు తనతో అమానుషంగా ప్రవర్తించారంటూ గులాబీ పార్టీ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ఆరోపించారు. అక్కడే కన్నీటిపర్యంతం అయ్యారు. దీనిపై మాజీమంత్రి సబితా ఇంద్రారెడ్డి కూడా ఫైర్ అయ్యారు. సీఎంకు మహిళలంటే గౌరవం లేదని మండిపడ్డారు. రాష్ట్ర మహిళలకు సీఎం రేవంత్?రెడ్డి క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై పోలీసులు కూడా స్పందించారు. నల్ల టీషర్ట్?లు ధరించడంతోనే ప్రతిపక్ష పార్టీ సభ్యులను అడ్డుకున్నామన్న వ్యాఖ్యల్లో నిజం లేదని డీసీపీ శిల్పవల్లి వెల్లడించారు. టీషర్ట్?లపై అభ్యంతరకర పదాలు ఉన్నాయన్నారు. బీఆర్?ఎస్? ప్రజాప్రతినిధులతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదని స్పష్టం చేశారు. అయితే పోలీసులపై వచ్చిన ఆరోపణలను పరిశీలన చేస్తామన్నారు.

**హైకోర్టుకు బీఆర్ఎస్ :**

ఈ మొత్తం వ్యవహారంపై భారత రాష్ట్ర సమితి హైకోర్టును ఆశ్రయించింది. ఈ పిటిషన్?పై విచారణ చేపట్టిన రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పోలీసులకు స్పష్టమైన ఆదేశాలు జారీచేసింది. అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తి నివేదిక ఇవ్వాలంటూ హోంశాఖకు నోటీసులు ఇచ్చింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలపాటు వాయిదా వేసింది.

# మండలి కోసం పోటా పోటీ

**వరంగల్ :** తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, త్వరలో జరగనున్న పట్టభద్రుల శాసనమండలి ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. వచ్చే ఏడాది మార్చి నెలలో జరగనున్న మహబూబ్‌నగర్- హైదరాబాద్- రంగారెడ్డి, అలాగే నల్గొండ-వరంగల్-ఖమ్మం పట్టభద్రుల నియోజకవర్గాల ఎన్నికల వేడి గాంధీభవన్‌లో ఇప్పుడే మొద లైంది. అక్టోబర్ నెల నుంచి ఓటరు నమోదు కార్యక్రమాలు ప్రారంభం కానుండటంతో, అధికార పార్టీలో టికెట్ ఆశిస్తున్న నేతల హడావిడి పీక్స్‌కు చేరింది. ఈ రెండు పట్టభద్రుల స్థానా ల పరిధిలో ఉమ్మడి ఆరు జిల్లాలు ఉన్నాయి. హైదరాబాద్, రంగారెడ్డి మినహా మిగిలిన నాలుగు ఉమ్మడి జిల్లాల్లోని మెజారిటీ అసెంబ్లీ స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. పట్టభద్రుల తీర్పు ప్రభుత్వ పనితీరుకు రెఫరెండంగా మారే అవకాశం ఉండటంతో, ఫలితం తేడా వస్తే భవిష్యత్ ఎన్నిక లపై ప్రభావం పడుతుందన్న అంచనాతో సీఎం రేవంత్‌రెడ్డి ఈ ఎన్నికలను ఛాలెంజ్‌గా తీసుకున్నారు. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో పాటు కీలక మంత్రులు అభ్యర్థుల ఎంపికపై ముమ్మర కసరత్తు చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గానికి మూడు నుంచి నాలుగు పేర్లతో కూడిన షార్ట్‌లిస్ట్‌ను అధిష్ఠానానికి పంపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. మహబూబ్ నగర్- రంగారెడ్డి-హైదరాబాద్ స్థానానికి ఆశావహులు పెద్దఎత్తున పోటీ పడుతున్నారు. ఇన్‌ఛార్జ్ మంత్రులు శ్రీధర్‌బా బు, పొన్నం ప్రభాకర్, దామోదర రాజనర్సింహ స్థానిక ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో సంప్రదింపులు జరిపి జాబితా రూపొందించారు. పార్టీ సీనియర్ నేత, మీడియా అండ్ కమ్యూనికేషన్స్ విభాగం మాజీ చైర్మన్ సామా రామ్మోహన్‌రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డికి ఉపాధ్యాయ సంఘాల నేపథ్యం ఉంది. ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్ పేరు కూడా పరిశీలనలో ఉన్నాయి. టీశాట్ చైర్మన్ వేణుగోపాల్‌రెడ్డి, బీసీ నేత గౌరి సతీష్, షాప్ మాజీ చైర్మన్ శివసేనారెడ్డితో పాటు కాలుష్య నియంత్రణ మండలి బోర్డు సభ్యుడు రాకూర్ బాలాసింగ్ పేర్లను కూడా పార్టీ నాయకత్వం పరిశీలిస్తోంది. ఇక నల్గొండ-ఖమ్మం-వరంగల్ స్థానంపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాసంలో మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సీతక్క ప్రత్యేకంగా భేటీ అయ్యారు. శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి తనయుడు గుత్తా అమిత్‌రెడ్డి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఆర్టీఐ కమిషనర్ పి.వి. శ్రీనివాస్, నల్గొండ డీసీసీ అధ్యక్షుడు కైలాష్ నేత పేర్లు ప్రముఖంగా ఉన్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్ నుంచి పోటీ చేసిన ఇందిర, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్, పార్టీ నేత లోకేష్ యాదవ్, ఖమ్మం విద్యాసంస్థల అధినేత మొండిం కిరణ్‌కుమార్ ఆశావహుల జాబితాలో ఉన్నారు. మరోవైపు పొత్తులో భాగంగా ఈ సీటు తమకు కేటాయించాలని టీజేఎస్ అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం కోరుతుండటం గమనార్హం. పట్టభద్రుల స్థానాలతో పాటు నవంబర్, డిసెంబర్ నెలల్లో నాలుగు గవర్నర్ కోటా ఎమ్మెల్సీ సీట్లు భర్తీకి రానున్నాయి. ప్రస్తుత ఎమ్మెల్సీలు గోరటి వెంకన్న, బస్వరాజు సారయ్య, బొగ్గారపు దయానంద్‌ల పదవీకాలం నవంబర్ 14న ముగియనుంది. డిసెంబర్ 18న మధుసూ దనాచారి పదవీకాలం పూర్తవుతుంది. ఈ నాలుగు నామినే టెడ్ స్థానాలు కూడా అధికార కాంగ్రెస్ ఖాతాలోకే వెళ్లను న్నాయి. కళాకారుల కోటాలో సీఎంతో సన్నిహిత సంబం ధాలున్న గోరటి వెంకన్నను మళ్లీ కొనసాగిస్తారా లేదా అన్నది ఆసక్తికరంగా మారింది. బీఆర్ఎస్ ద్వారా నామినేట్ అయి ప్రస్తుతం కాంగ్రెస్‌లో ఉన్న బస్వరాజు సారయ్య మళ్లీ అవకా శం ఆశిస్తున్నారు. మరోవైపు సమాచార కమిషనర్ బోరెడ్డి అయోధ్యరెడ్డి, కరీంనగర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లేశం పేర్లు గవర్నర్ కోటా రేసులో బలంగా వినిపిస్తున్నా యి. సామాజిక సమీకరణాలు, గెలుపు గుర్రాలకే ప్రాధాన్యం ఇస్తూ కాంగ్రెస్ అధిష్ఠానం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోం ది. గ్రౌండ్ రియాలిటీని బేరీజు వేసుకుంటూ, ఆశావహుల అ సంతృప్తి పార్టీపై పడకుండా శాసనమండలి పోరులో క్లీన్‌స్వీప్ చేయడమే లక్ష్యంగా హస్తం పార్టీ కసరత్తు ముమ్మరం చేసింది.

## ఎస్ఐఆర్ గడువు పొడిగింపు

-మొదటిపేజీ తరువాయి

సమగ్ర సవరణ (సర్) మొదటి నుంచి గందరగోళంగా ఉంది. ఎన్యూమరేషన్ సమయంలోనే అనేక ఇబ్బందులు తలెత్తగా, ప్రస్తుతం నోటీసుల ప్రక్రియ కూడా అలానే సాగుతోంది. బీఎల్‌వోల అవగాహన లోపం, నిర్లక్ష్యం అనేక చోట్ల కనిపిస్తోంది. దీంతో అభ్యంతరాలు, క్లైయిమ్?ల స్వీకరణ కూడా మందకొడిగా సాగుతోంది. ఇంటింటికి వెళ్లి ఓటర్లకు నోటీసులు అందించాలని ఎన్నికల సంఘం స్పష్టమైన ఆదేశాలు ఇస్తున్నా, క్షేత్రస్థాయి సిబ్బంది మాత్రం, కొన్ని చోట్ల నోటీసులు నేరుగా అందిస్తూ, మరికొన్ని చోట్ల ఫోన్ చేసి నోటీసులు తీసుకెళ్లాలని చెబుతున్న ఘటనలు వెలుగులోకి వస్తున్నాయి. దీనికి తోడు ప్రజల్లోను అవగాహన లోపం కనిపిస్తోంది. కొన్ని చోట్ల భారీగా నోటీసులు జారీ చేసింది. చాలా తక్కువ మంది మాత్రమే హియరింగ్‌కు హాజరవుతున్నారు.

**బీఎల్‌వోల నిర్లక్ష్యం**

విచారణ తేదీ నాటికి వారం రోజుల ముందుగానే ఓటర్లకు నేరుగా నోటీసులు ఇవ్వాల్సి ఉన్నా, బీఎల్‌వోలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. దీంతో పాటు నోటీసులకు బదులిచ్చేందుకు ఏయే డాక్యుమెంట్స్ అవసరమో, ఓటర్లకు సరైన అవగాహన లేకపోవడమూ గందరగోళానికి కారణంగా తెలుస్తోంది. దీంతో విచారణకు కూడా హాజరుకావడం లేదని సమాచారం. ఇప్పటికి 47.79 లక్షల మందికి నోటీసులు జారీ అయ్యాయి. అయితే అందులో ఏకంగా 32 లక్షల మంది నుంచి సమాధానం రాలేదని తెలుస్తోంది. దీంతో వారికి మరోసారి నోటీసులు ఇస్తున్నారు. ఓటర్ల ఫైనల్ లిస్ట్‌లో పేరు ఉండాలంటే కచ్చితంగా నోటీసులకు సమాధానం ఇవ్వాలని అధికారులు స్పష్టం చేస్తున్నారు.

## చర్చకు మేం సిద్ధం

-మొదటిపేజీ తరువాయి

అవమానం జరిగిందని, ఆ అంశంపై చర్చ జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ముందుగా 22ఏ పై చర్చ జరపాలని బీజేపీ డిమాండ్ చేసింది. కమలం సభ్యుల తీరును ముఖ్యమంత్రి తప్పుపట్టారు. బీఆర్ఎస్ నేతల అపవాదును బీజేపీ నేతలు ఎందుకు మోస్తున్నారని రేవంత్ రెడ్డి ప్రశ్నించారు. స్పీకర్‌కు అవమానం జరిగిన ఈరోజు తెలంగాణకు చీకటి రోజు అని, ఈరోజు నాలుగు కోట్ల ప్రజలకు అవమానం జరిగిన రోజు అని సీఎం ప్రకటించారు. కేసీఆర్ తన ఎమ్మెల్యేలను నిన్న పిలిపించుకుని స్పీకర్‌పై ఉసిగొల్పారని ఆరోపించారు. ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదని, పథకం ప్రకారం జరిగిందేనని పేర్కొన్నారు.

స్పీకర్‌ను అవమానించడమంటే వైద్యం చేసే వైద్యుడినే గాయపరిచినట్టు ఉందని సీఎం అన్నారు. సభాపతికి జరిగిన అవమానం సభకు జరిగిన అవమానంగానే భావించాలని, స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చకు బీజేపీ సభ్యులు సహకరించాలని కోరారు. స్పీకర్‌కు జరిగిన అవమానంపై చర్చ తర్వాత ఏ అంశంపైనైనా చర్చిద్దామని తెలిపారు. "స్పీకర్‌కు జరిగిన అవమానం సభకు జరిగిన అవమానంగానే భావించాలి. స్వాతంత్ర భారతంలో ఇలాంటి అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇలాంటి భాష వాడిన సభ్యుడిని డిస్మిస్ చేయాలి. ఇలాంటి వాటిని క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండదు. అసభ్యకర భాషను వాడిన సభ్యుడి చేత కేసీఆర్ రాజీనామా చేయించాలి"

**అసభ్యకర భాషను వాడిన సభ్యుడిని బర్తరఫ్ చేయాలి**

సీఎం వ్యాఖ్యలపై బీజేపీ సభ్యులు స్పందించారు. స్పీకర్‌పై తాతా మధు వాడిన భాషను తమ పార్టీ ఖండిస్తోందని బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌పై అసభ్యకర భాషను వాడిన సభ్యుడిని బర్తరఫ్ చేయాలన్నారు. తాతా మధు వ్యాఖ్యలకు బాధ్యతగా కేసీఆర్ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

**కేసీఆర్ క్షమాపణ చెప్పాలి**

బీఆర్ఎస్ సభ్యుల తీరు సభ్యసమాజం తలదించుకునేలా ఉందన్నారు మంత్రి సీతక్క. స్పీకర్‌పై అత్యంత హేయమైన భాష వినియోగించారని, ఆ సభ్యులపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలని ఆమె డిమాండ్ చేశారు. తాతా మధు వ్యాఖ్యలకు బాధ్యత వహించి కేసీఆర్ క్షమాపణ చెప్పాలన్నారు.

## రణరంగం..



-మొదటిపేజీ తరువాయి

బీఆర్ఎస్ నడుమ సభ లోపలా, బయటా ఆరోపణలు, విమర్శలు, పరస్పర సవాళ్లకు తెరతీశాయి.

**టీషర్టు విప్పి లోనికి అనుమతించాలన్న హరీశ్‌రావు**

సోమవారం ఉదయం 9 గంటలకు అసెంబ్లీ ఎదురుగా గన్‌పార్కు వద్ద ఉన్న అమరుల స్తూపానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేలులు, ఎమ్మెల్సీలు నివాళులర్పించారు. అనంతరం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీ రామారావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు నేతృత్వంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే సమావేశాలకు హాజరయ్యేందుకు నల్లని టీషర్టులు ధరించి, నినాదాలు చేస్తూ అసెంబ్లీ మెయిన్ గేటు వద్దకు చేరుకున్నారు. 'హామీల అమల్లో కాంగ్రెస్ వైఫల్యం.. వెయ్యి రోజుల పాలన నిష్ఫలం' అంటూ టీషర్టులపై నినాదాలు ఉండటంతో పోలీసులు అభ్యంతరం తెలిపారు. బీఆర్ఎస్ సభ్యులు లోనికి వెళ్లకుండా అడ్డుకున్నారు. దీంతో మెయిన్ గేటు వద్ద బైఠాయించిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేశారు. అసెంబ్లీలోకి చొచ్చుకు వెళ్లేందుకు ప్రయత్నించారు. పోలీసులు అడ్డుకోవడంతో హరీశ్మురావు వాగ్వివాదానికి దిగారు. ఆ సమయంలో జరిగిన తోపులాటలో హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి కిందపడిపోయారు. దీంతో ఆగ్రహించిన హరీశ్‌రావు తాను ధరించిన నల్ల టీ షర్టును విప్పి విసిరేశారు. ఎలాంటి నినాదాలు లేనందున తనును అసెంబ్లీలోకి వెళ్లేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్యే దేవిరెడ్డి సుదీర్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి కూడా టీషర్టులు విప్పి నిరసన తెలిపారు. దీంతో పోలీసులు హరీశ్‌రావుతో పాటు ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును పోలీసు వాహనంలో తెలంగాణ భవన్‌కు తరలించారు.

**మహిళా నేతల ఆవేదన**

అసెంబ్లీ వద్ద పోలీసుల తోపులాటలో హరీశ్‌రావుతో పాటు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి కిందపడిపోయారు. జగదీశ్‌రెడ్డి అస్వస్థతకు గురికాగా.. ఎమ్మెల్యేలు సుదీర్‌రెడ్డి, గంగుల కమలాకర్ తదితరులు సపర్యలు చేశారు. మరికొందరికి స్వల్ప గాయాలయ్యాయి. కేటీఆర్‌ను పోలీసులు బలవంతంగా వాహనంలోకి ఎక్కించడంతో ఆయన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మారెడ్డి పోలీసుల తీరుపై ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులు జుట్టు పట్టుకుని, గొంతు నొక్కారని సబిత ఆరోపించగా, తన చీర లాగారంటూ సునీత కన్నీటి పర్యంతమయ్యారు. సబిత, సునీత, కోవా లక్ష్మితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాధవరం కృష్ణారావు తదితరులు అసెంబ్లీ గేటు వద్ద బైఠాయించగా వారినీ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.

సంపాదకీయం

# మళ్లీ మొదటికి నీటి పంచాయితీ

కృష్ణా జలాల్లో వాటాల విషయంలో కొట్లాడుకుంటున్న అధికార కాంగ్రెస్, ప్రతిపక్ష బీఆరెస్ పార్టీల నేతలు.. అసలు విషయాన్ని పక్కన పెట్టి.. షాడో ఫైట్ చేస్తున్నారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నీటి వాటాలు ఉన్నా.. వాటిని వినియోగించుకునేందుకు తగిన ప్రాజెక్టులు ఏవని సాగునీటి నిపుణులు ప్రశ్నిస్తున్నారు. ముందుగా పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే.. కేటాయింపుల మేరకైనా నీటిని నిల్వ చేసుకునే అవకాశం లభిస్తుందని సూచిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ మధ్య నీళ్ల పంచాయితీ ఇంకా తెగలేదు. కృష్ణా జలాలపై తమ వాటాలపై ఇంకా ఎటూ తేలలేదు. శ్రీశైలం, నాగార్జునసాగర్ జలాలను తాగునీటి అవసరాల కోసం రెండు రాష్ట్రాలకు పంపిణీ చేసేందుకు శుక్రవారం హైదరాబాద్‌లోని జలసౌధ కృష్ణా బోర్డు ఆఫీసులో త్రిసభ్య కమిటీ భేటీ అయింది. కృష్ణా బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్, తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్సీ రమేశ్‌బాబు, ఏపీ జలవనరుల శాఖ ఈఎన్సీ నరసింహమూర్తి సమావేశం అయ్యారు. ఆగస్టు 25న జరిగిన సమావేశంలో చర్చలు కొలిక్కి రాకపోవడంతో బోర్డు సమావేశం వాయిదా పడిన సంగతి తెలిసిందే. తిరిగి శుక్రవారం మరోసారి బోర్డు సమావేశం జరిగినా.. ఎలా ఫలితం తేలకుండానే ముగిసింది. ఈ నెల చివరి వారంలో మరోసారి జరిగే కృష్ణా బోర్డు సమావేశానికి కేఆర్ఎంబీ ఛైర్మన్ బోర్డు అధ్యక్షత వహించనున్నారు. ఎల్‌నినో ప్రభావంతో.. శ్రీశైలం, నాగార్జునసాగర్‌లలోని నీటి నిల్వలను తాగునీటికే వినియోగించాలని మొదటిగా చర్చించారు. కృష్ణా బేసిన్‌లో ప్రజలకు ఎక్కువ భాగం తాగునీటిని సరఫరా చేయాలని, ముఖ్యంగా హైదరాబాద్‌తోపాటు పరిసర ప్రాంతాలకు 50% వాటా కింద నీటిని విడుదల చేయాలని తెలంగాణ కోరింది. వచ్చే ఏడాది ఆగస్టు వరకు 200 టీఎంసీలు కేటాయించాలని కోరింది. తమ అవసరాలకు 104 టీఎంసీల కేటాయించాలని ఏపీ.. కృష్ణా బోర్డును కోరింది. ఏపీ, తెలంగాణలకు 66:34 నిష్పత్తిని అమలు చేస్తూ తక్షణమే తమకు 97 టీఎంసీల నీళ్లు విడుదల చేయాలని ఏపీ కోరింది. అయితే ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉండడంతో 50 శాతం చొప్పున జలాలు కేటాయించాలని తెలంగాణ కోరింది. పోతిరెడ్డిపాడు, వెలిగొండ ప్రాజెక్టు నుంచి నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తున్నారని తెలంగాణ ఆరోపించింది. దీనిపై ఏపీ స్పందిస్తూ న్యాయబద్ధంగా వచ్చిన నీటి నుంచే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా తీసుకుంటున్నట్లు పేర్కొంది. అవసరం లేకున్నా.. తెలంగాణ శ్రీశైలం ప్రాజెక్టు నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసి నీటిని దిగువకు వదులుతోందని పేర్కొంది. దానిని వెంటనే అడ్డుకోవాలని కోరింది. దీనికి తెలంగాణ స్పందిస్తూ పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ తరలిస్తున్న నీటిని వెంటనే నియంత్రణ కోరింది. ఎల్‌నినో ప్రభావంతో ఇరు రాష్ట్రాలు ఉమ్మడి జలాశయాల నుంచి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని బోర్డు మెంబర్ సెక్రటరీ సతీష్ కాంబోజ్ సూచించారు. శ్రీశైలం నుంచి పోతిరెడ్డిపాడుకు నీటి విడుదలను ఏపీ నియంత్రించాలి. విద్యుదుత్పత్తికి నీటిని విడుదల చేయడాన్ని తెలంగాణ ఆపాలని కోరారని మినిట్స్‌లో తెలియజేశారు. పులిచింత, కేడీఎస్, తుంగభద్రతో సహా అనేక ప్రాజెక్టుల్లో, పెన్నా బేసిన్‌లో 80 టీఎంసీలు ఉన్నాయని తెలంగాణ ఈఎన్సీ రమేశ్ బాబు తెలిపారు. ఎల్‌నినో ప్రభావం వల్ల ఉమ్మడి జలాశయాల్లో నీటి లభ్యత గణనీయంగా తగ్గిందని, ప్రస్తుతం ఉన్న నిల్వలను కేవలం తాగునీటి అవసరాలకే కేటాయించాలని తెలంగాణ వాదించింది. హైదరాబాద్ మహానగరంతో పాటు పరిసర ప్రాంతాల తాగునీటి అవసరాలను పరిగణనలోకి తీసుకుని, ఉమ్మడి జలాశయాల నుంచి 200 టీఎంసీల నీటిని కేటాయించాలని కోరింది. అలాగే పాత విధానం కాకుండా రెండు రాష్ట్రాలకు 50:50 నిష్పత్తిలో సమానంగా నీటిని పంపిణీ చేయాలని తెలంగాణ ఈఎన్సీ రమేశ్‌బాబు ప్రతిపాదించారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి ఏపీ నిబంధనలకు విరుద్ధంగా నీటిని తరలిస్తోందని, ఇటీవల ప్రారంభించిన వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కూడా అనుమతుల్లేకుండా జలాలను తోడేస్తోందని తెలంగాణ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. తెలంగాణ డిమాండ్‌ను ఏపీ తీవ్రంగా తిరస్కరించింది. ప్రస్తుతానికి తక్షణ అవసరాల కోసం 97 టీఎంసీలను విడుదల చేయాలని కోరారు. తమ వాటా పరిధిలోనే పోతిరెడ్డిపాడు, వెలిగొండ ద్వారా నీటిని వాడుకుంటున్నామని స్పష్టం చేస్తూ.. తెలంగాణ డిమాండ్ చేసిన 200 టీఎంసీల కేటాయింపు సహేతుకం కాదన్నారు. పైగా తెలంగాణ విద్యుత్ ఉత్పత్తి పేరుతో శ్రీశైలం నుంచి అనవసరంగా దిగువకు నీటిని విడుదల చేస్తోందని, దీనిని తక్షణమే నిలువరించాలని ఏపీ ఫిర్యాదు చేసింది. పోతిరెడ్డిపాడు 19 టీఎంసీలు, చెన్నై తాగునీటి కోసం 15 టీఎంసీలు తీసుకుంటున్నారు. ఈ ఏడాది అక్టోబరు వరకు 22 టీఎంసీలు తీసుకుంటామని ఏపీ చెప్పిందన్నారు. ఇప్పటికే 20 టీఎంసీలు వాడుకున్నారన్నారు. వెలిగొండ నుంచి కూడా వాడుకుంటూ.. ఇంకా పాత నిష్పత్తిలో నీటి కేటాయింపు కావాలని కోరడం సరికాదన్నారు. వచ్చే ఏడాది ఆగస్టు వరకు ఏపీకి 104 టీఎంసీలు కావాలని కోరామని ఏపీ ఈఎన్సీ నరహింమూర్తి తెలిపారు. తెలంగాణ 200 టీఎంసీలు కావాలనడం సరికాదన్నారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపు కోసం కర్ణాటక ప్రభుత్వం భూసేకరణ పనులు వేగవంతం చేసున్నా.. తెలంగాణ ప్రభు త్వం ఏమాత్రం పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కేసీఆర్ హయాంలో లేని నీటి వివాదాలు ఇప్పుడే ఎందుకు వస్తున్నాయని, ఆయన హయాంలో ఏపీ నాయకులు ఎందుకు ఇంత ధైర్యం చేయలేదని ప్రశ్నించారు. వరదలు లేని సమయంలో వెలిగొండ ప్రాజెక్టును ప్రారంభించడంలో ఆంతర్యమేందని నిలదీశారు. కాళేశ్వరం బరాజ్‌లు సురక్షితమేనని ఎన్‌డీఎస్ఏ, సీడబ్ల్యూపీఆర్ఎస్ సంస్థలు స్పష్టత ఇచ్చిన తర్వాతైనా కన్నెపల్లి పంపులను వెంటనే ఆన్‌చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాలమూరు పంపులనూ ఆన్ చేయాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డికి కృష్ణా నదిపై ఉన్న ప్రాజెక్టులపై కనీస అవగాహన లేదని మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఎద్దేవా చేశారు. జూరాల ప్రాజెక్టు సామర్థ్యం కేవలం 6.5 టీఎంసీలే కావడం వల్ల భీమా, నెట్టెంపాడు, ఆర్డీఎస్ కింద లక్షలాది ఎకరాల పంటలు ఎండిపోయే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ హయాంలోనే వలసల జిల్లా పాలమూరు రూపురేఖలు మారాయని గుర్తుచేశారు. కాంగ్రెస్ వచ్చాక పాలమూరు బిడ్డలు మళ్లీ వలసబాట పట్టే దుస్థితి దాపురించిందని ఆవేదన వ్యకం చేశారు.

# మూడో దశకూ మారని 'సర్'



ఎవరెన్ని అభ్యంతరాలు చెప్పినా... మీడియా సాక్షిగా ఎలాంటి అవకతవకలు బయట పడుతున్నా 'స్వచ్ఛమైన' ఓటర్ల జాబితా రూపకల్పన పేరిట ఎన్నికల సంఘం(ఈసీ) చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియలో మూడో దశ పూర్తయింది. ఈసారి 16 రాష్ట్రాలూ, మూడు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 36.73 కోట్లమంది ఓటర్ల జాబితా లను జల్లెడబట్టి 6 కోట్లమందిని తొలగించినట్టు ఈసీ ప్రకటించింది. ఈ ప్రక్రియకు తొలి దశలో వచ్చినంత వ్యతిరేకత మలి దశలో లేదు. న్యాయస్థానాలు ఏవో కొన్ని ఆదేశాలీయటం మినహా ప్రక్రియను ఆపింది లేదు. మొదటి రెండు దశలతో పోలిస్తే మూడో దశ పెద్దగా అభ్యంతరాలు లేకుండానే పూర్తయినట్టు లెక్క. మొత్తంగా ఈ మూడు దశల్లోనూ 13 కోట్లమంది గల్లంతయ్యారు. దానర్థం వీరంతా అసలే లేకుండా పోయారని కాదు. జాబితాలో లేనివారు అభ్యంతరాలు చెబితే... ఈసీ అడిగిన పత్రాలు సమర్పించు కుంటే మళ్లీ చోటు దక్కించుకునే చాన్స్ ఉండొచ్చు. కానీ ఆ పత్రాల కోసం దూర ప్రాంతాల్లో ఉండే ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగే ఓపిక ఉండాలి.

అందుకు కావలసిన తీరిక, సహనం ఉండాలి. ఖర్చు పెట్టగలిగే స్థోమత ఉండాలి. వారం, పదిరోజులు పనికి వెళ్లకున్నా కుటుంబం గడుస్తుందన్న భరోసా ఉండాలి. ఇంత చేసినా వచ్చే ఎన్నికల్లో ఓటేసే యోగం దక్కుతుందని అనుకుంటే అమాయకత్వమే. బెంగాల్‌లో ఒక అక్షరం ఇటూ అటూ అయినా జాబితాల్లో చోటుదక్కని వారు లక్షల్లో ఉన్నారు. 'తార్కిక వ్యత్యాసాల' పేరిట జాబితాల నుంచి వీరందరినీ వెళ్లగొట్టగా, 38 లక్షలమంది 19 ట్రిబ్యునళ్ల ముందు అప్పీల్ చేసుకున్నారు. ఇందులో కేవలం 82,000 మందికి ఊరట దొరికింది. పరిష్కరించిన అప్పీళ్లలో 90 శాతం మందికి తిరిగి చోటు దక్కింది. కానీ ఏం ప్రయోజనం... రాబోయే ఎన్నికల్లో తప్ప వీరు ఓటేయలేరు. వేలాది కోట్ల రూపాయలు బ్యాంకుల్లో అప్పు తీసుకుని ఎగ్గొట్టే వారిపై దయ చూపి 'హెయిర్ కట్' పేరిట మాఫీ చేస్తారు. ఓటర్ల జాబితాలకు ఈసీ చేసే ఈ 'హెయిర్ కట్' నిరుపేదలతో నిర్దయగా వ్యవహరిస్తుంది. వారిని కష్టాలపాలు చేస్తుంది.

బిహార్‌లో 'సర్'పై విచారణ సందర్భంగా 'విపక్షాలు హడావుడి చేస్తున్నాయి... మరి స్వల్ప సంఖ్యలో మాత్రమే అభ్యంతరాలు ఎందుకొస్తున్నా'యని ధర్మాసనం ప్రశ్నించింది. సహేతుకమైన సందేహమే. కారణాలనేకం. తమ ఓటరు కార్డు కేవలం ఎన్నికల సమయంలోనే అక్కరకొస్తుందని అనేకులు అనుకుంటారు. పోలింగ్ రోజున వెళ్లినప్పుడు మాత్రమే ఓటు గల్లంతయిందని తెలుస్తుంది. ఇదంతా మన పాలకుల నిర్వాకం. అవిద్య రాజ్యమేలేచోట ఏ ప్రచారమూ జనానికి పూర్తిగా చేరదు. 'నిజాయితీగల' ఓటర్లమేనని నిరూపించుకునే భారం ప్రజలకు వదిలితే ఎక్కడైనా జరిగేది ఇదే! చిన్న చిన్న లోపాలు మినహా అంతా సవ్యంగా చేశామని ఈసీ స్వోత్కర్షలకు పోతోంది. కానీ క్షేత్రస్థాయిలో జరుగుతున్నది వేరు. ఇందుకు ఒక ఆంగ్ల దినపత్రికలో జార్ఖండ్ గురించి వచ్చిన కథనమే తార్కాణం. అక్కడ గొడ్డా జిల్లాలో కొన్ని పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా జాబితా ప్రకటించాక ఫలానా వారి పేర్లు తొలగించాలంటూ బీజేపీ ఏజెంట్లు ఫామ్--7 పత్రాలు సమర్పించినట్టు ఆ పత్రిక వెల్లడించింది.

ఒక కేంద్రంలో ఇలాంటివి 25 దాఖలయ్యాయి. వారిలో ఒకే ఒక్కరు మూణ్ణెల్లక్రితం మరోచోట కూలీ పని కోసం వెళ్లారు. మరోచోట ఒక బీజేపీ ఎమ్మెల్యే 75 ఫామ్‌లు సమర్పించారు. చిత్రమేమంటే... అవన్నీ మైనారిటీల ఓట్లు. వాటిలో అత్యధికం 2003 జాబితాతో మ్యాపింగ్ అయ్యాయి. ఇక వేరే జిల్లాల్లో ఏం జరిగిందో... అసలు 'కొత్తగా చేరుతున్న' వారెవరో తెలియదు. ఓటు లేకపోవటం మరణంతో సమానమని అనేకులు నమ్ముతారు. బీఎల్ఓ వెళ్లినప్పుడు ఇంట్లో లేనంత మాత్రాన ఓటరే ఉనికిలో లేడన్న నిర్ణయానికి రావటం క్రూరం. ఎందుకంటే ఈసారి ఓటు పోవటమంటే సంక్షేమ పథకాలు ఆగిపోవటం,ముందూ మునుపూ పౌరసత్వం కూడా మాయం కావటం. కొన్ని ప్రభుత్వాలు సంక్షేమా నికి ఓటర్ల జాబితా గీటురాయి కాబోదని హామీ ఇస్తున్నాయి గానీ... అది దయాధర్మ బిక్షంగా మారటం సాధారణ పౌరుణ్ణి అవమానించటం. రేపన్న రోజున అలాంటి వారందరికీ పథకాలు ఆపేయాల్సిందేనంటూ ఆదేశాలు జారీ కాబోవని చెప్పలేం. ఆ మాటెలా వున్నా ఓటరును పోలింగ్ కేంద్రం వైపు రాకుండా ఇంత చక్కని మార్గం 'కనిపెట్టిన' ఈసీని అభినందించి తీరాలి!

# వాతావరణ మార్పుతో జీవన విధ్వంసం

వాతావరణ మార్పులు, ప్రతికూల ప్రభావాలు ప్రస్తుతం స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రాణాంతకంగా కరిగిపోతున్న హిమాలయ హిమానీనదాల నుంచి కేరళలోని పశ్చిమ కనుమల్లో కొండచరియలు విరిగిపడుతున్న ఘటనల వరకు చూస్తూనే ఉన్నాం. మరోవైపు ప్రజలు వినియోగిస్తున్న వివిధ పరికరాల ద్వారా వాతావరణంలో కర్బన ఉద్గారాలు పెరిగిపోతున్నాయి. దేశంలోనే కాదు, ప్రపంచవ్యాప్తంగా కూడా సామాన్య కుటుంబాలతో పోల్చితే, సంపన్న కుటుంబాలే కర్బన ఉద్గారాలను ఏడు రెట్లు ఎక్కువ విడుదల చేస్తున్నాయని అధ్యయనాలు చెప్తున్నాయి. ఫలితంగా సమాజంలోని అందరి జీవితాలను దెబ్బతీస్తున్నాయి. అధికంగా కర్బన ఉద్గారాలను విడుదల చేస్తున్న సంపన్న కుటుంబాలు తమ జీవనశైలిని మార్చుకోవడానికి సిద్ధంగా ఉన్నాయా? అనే ప్రశ్న ఇప్పుడు తలెత్తుతున్నది. పర్యావరణ ఉత్పత్తులు వాడండి భూమి నుంచి బయటకు వెళ్లాల్సిన వేడికి ఆటంకం ఏర్పడటం ద్వారా భూమి ఉపరితల సగటు ఉష్ణోగ్రత పెరుగడాన్ని భూతాపం (గ్లోబల్ వార్మింగ్) అంటారు. బొగ్గు మండించడం ద్వారా ఉత్పత్తయ్యే కర్బన ఉద్గారాలు, అడవుల నరికివేతతో ఏర్పడే గ్రీన్‌హౌస్ వాయువులు భూమి నుంచి బయటకు వెళ్లాల్సిన వేడికి ఆటంకం కలిగిస్తుంటాయి. ప్రపంచ వ్యాప్తంగా వాతావరణ మార్పుపై ఇంటర్ గవర్నమెంటల్ ప్యానెల్ (ఐపీసీసీ) శాస్త్రవేత్తలు, నిపుణుల అధ్యయనంలో కీలక విషయాలను గుర్తించారు. వందేండ్లలో భూమి ఉపరితల సగటు ఉష్ణోగ్రత 1.1 సెల్సియస్ పెరిగిందని నిర్ధారించారు. ఇందులో 1.07 సెల్సియస్ ఉష్ణోగ్రత పెరుగుదలకు మనుషుల కార్యకలాపాలే కారణమని అంచనావేశారు. వాతావరణ నివేదికలు చూడండి ముఖ్యంగా 1970 తర్వాత ఉష్ణోగ్రతల పెరుగుదల రేటు మరింత వేగవంతమైందని గుర్తించారు. వాతావరణ మార్పుతో సముద్ర మట్టంతోపాటు సముద్ర ఉపరితల, పెద్ద సరస్సుల ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయి. భారీ వర్షపాతం కారణంగా వరదలు సంభవిస్తున్నాయి. కరువు పరిస్థితులు తీవ్రమై పంటలు ఎండిపోతున్నాయి. పర్యావరణ వ్యవస్థల్లో ప్రతికూల మార్పులు చోటుచేసుకుంటున్నాయి. ఇటీవల హిమాలయాల్లో హిమానీనదాల క్షీణత తీవ్రం కావడమే ఇందుకు నిదర్శనం. భూతాపంతో పెనుతుఫాన్‌లు అంతకంతకూ ఎక్కువగా, అధిక తీవ్రతతో సంభవిస్తుంటాయి. వేడి గాలులు తరచుగా, ఎక్కువ తీవ్రతతో వీచడం వంటి పరిస్థితులు ఏర్పడుతున్నాయి. పెరుగుతున్న ఉష్ణోగ్రతలు మానవ ఆరోగ్యం మీద ప్రభావం చూపుతున్నాయి. వాతావరణ మార్పుల వల్ల సున్నితమైన హిమాలయ పర్యావరణ వ్యవస్థ వేగంగా అస్థిరమవుతున్నది. హిమానీనదాల క్షీణతతో కోట్లాది మంది జీవనోపాధికి, నీటి భద్రతకు ముప్పు సంభవించే ప్రమాదం పొంచి ఉన్నది. హిమాలయాల్లో ఉద్భవించే ప్రధానమైన సింధు, గంగా, బ్రహ్మపుత్ర నదుల ప్రవాహంలో తీవ్ర హెచ్చుతగ్గులు ఏర్పడుతున్నాయి.

నదీ ప్రవాహాల్లోని అస్థిరతల వల్ల వ్యవసాయం, తాగునీటి సరఫరాపై ప్రతికూల ప్రభావం పడుతున్నది. పర్వతాలు, మైదాన ప్రాంతాల్లో నివసించే ప్రజలు నిరాశ్రయులయ్యే ప్రమాదంలోకి నెడుతున్నది. ఈ నేపథ్యంలోనే నదులను అనుసంధానం చేసే కార్యక్రమాలను కూడా చాలా జాగ్రత్తగా పరిశీలించాల్సి ఉన్నది.

గ్లోబల్‌క్లైమేట్ రిస్క్ ఇండెక్స్-2021 ప్రకారం వాతావరణ మార్పుల వల్ల అత్యధికంగా ప్రభావితమవుతున్న ప్రపంచంలోని టాప్ 10 దేశాల్లో భారత్ కూడా ఒకటి. మరోవైపు లండన్‌కు చెందిన అంతర్జాతీయ థింక్ ట్యాంక్ ఓవర్సీస్ డెవలప్‌మెంట్ ఇనిస్టిట్యూట్ 2021 జూన్‌లో 'ది కాస్ట్ ఆఫ్‌క్లైమేట్ చేంజ్ ఇన్ ఇండియా' పేరుతో విడుదల చేసిన నివేదిక కూడా సంచలన అంశాలను బయటపెట్టింది. వాతావరణ మార్పుల కారణంగా 2100 నాటికి భారత్ ఏటా జీడీపీలో 3 నుంచి 10 శాతం వరకు కోల్పోయే ప్రమాదం ఉన్నదని స్పష్టంచేసింది. 2040 నాటికి పేదరిక రేటు 3.5 శాతం పెరుగవచ్చని పేర్కొన్నది. వాతావరణ మార్పుల కారణంగా సంభవించే ప్రమాదాలతో ఖర్చులు, సమాజంలో అసమానతలు, పేదరికం కూడా పెరుగుతాయని ఈ నివేదిక వివరించింది. జీవనశైలిలో వస్తున్న మార్పుల కారణంగా భారత్‌లో ఏటా గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు నిరంతరం పెరుగుతున్నాయి. సమస్యను భిన్న కోణాల్లో పరిశీలించడానికి కార్బన్ ఫుట్‌ప్రింట్ విధానం ఒక మార్గంగా పనికొస్తుంది. కార్బన్ ఫుట్‌ప్రింట్ అంటే ఒక వ్యక్తి, సమాజం, కార్యక్రమం, సంస్థ, సేవ లేదా ఉత్పత్తి కారణంగా వెలువడే మొత్తం గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలు. ఇందులో కార్బన్ డయాక్సైడ్, మీథేన్ కూడా ఉన్నాయి. ఇక కార్బన్ డయాక్సైడ్‌ను అత్యధికంగా విడుదల చేసే పది దేశాలు ఇవి. చైనా (9.3 జిగా టన్నులు-జీటీ), అమెరికా (4.8), భారత్ (2.2), రష్యా (1.5), జపాన్ (1.1), జర్మనీ (0.7), దక్షిణ కొరియా (0.6), ఇరాన్ (0.6), కెనడా (0.5). అయితే, తలసరి ఉద్గారాలను పరిశీలిస్తే భారత్ ప్రపంచ సగటు కంటే చాలా దిగువన ఉన్నది.

ప్రపంచవ్యాప్తంగా వెలువడే మొత్తం ఉద్గారాల్లో భారత్ వాటా 7.1 శాతం కాగా, భారత్‌లో తలసరి ఉద్గారాలు సుమారు 2.47 టన్నులుగా ఉన్నది. ఇది ప్రపంచ తలసరి సగటు 6.45తో పోలిస్తే చాలా తక్కువ. ఇక్కడ కూడా అభివృద్ధి చెందిన దేశాలకు, భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలకు మధ్య చాలా వ్యత్యాసం ఉన్నది. రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమానిటీ అండ్ నేచర్ ఇటీవల నిర్వహించిన ఒక అధ్యయనం ప్రకారం, భారత్‌లో అధికంగా ఖర్చు చేసే సంపన్న కుటుంబాలు, దిగువ స్థాయి కుటుంబాల కంటే దాదాపు ఏడు రెట్లు ఎక్కువగా కార్బన్ ఉద్గారాలను విడుదల చేస్తున్నాయి. దేశంలోని వివిధ సామాజిక-ఆర్థిక వర్గాల్లో అత్యధిక ఉద్గారాలకు కారణమవుతున్న వ్యయాల్లో ఆహారం, విద్యుత్తు రెండు ప్రధాన రంగాలని అధ్యయనం గుర్తించింది. వాతావరణ మార్పులకు తక్కువ కారణం అయినప్పటికీ సామాన్యులు ఎక్కువగా నష్టపోతున్నారు. అందువల్ల, ప్రస్తుత ప్రపంచంలో భూతాపాన్ని ఎదుర్కొనేందుకు సుస్థిరమైన పరిష్కారాలు అత్యంత కీలకం. వాతావరణ మార్పులతో ప్రతికూల పరిస్థితులు ఏర్పడకుండా రెండు విధానాలను అనుసరించాల్సిన అవసరమున్నది. గ్రీన్‌హౌస్ వాయు ఉద్గారాలను, వాతావరణ మార్పుల పరిణామాల వల్ల ఎదురయ్యే ప్రమాదాలను తగ్గించడం ద్వారా సమస్యను అధిగమించవచ్చు. సమస్య పరిష్కారానికి తగిన విధానాలను ప్రజలు నిత్య జీవితంలో ఆచరణలో పెట్టినప్పుడే ఆశించిన ఫలితాలు సాధ్యమవుతాయి. అలాగే సమాజంలో ఆధునిక సాంకేతికత, సేవ లు, ఆర్థిక వృద్ధి, అభివృద్ధి ఒకవైపు ఉండగా, మరోవైపు పేదరికం, పోషకాహార లోపం, ఆరోగ్య సమస్యలు, సామాజిక వెలివేత, వనరుల క్షీణత సమస్యలు పీడిస్తున్నాయి. ఇది సమాజంలోని తీవ్రమైన వైరుధ్యానికి నిదర్శనం. కాబట్టి పరిష్కార మార్గాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడం, భాగస్వాములను చేసే విషయంలో ప్రభుత్వాలు, పార్టీలు ఈ వాస్తవాన్ని అర్థం చేసుకోవాలి.

## పీఎం రేసులోకి కొత్త పేర్లు

భారత జాతీయ రాజకీయం ఎప్పుడు ఏ మలుపు తిరుగుతుందో ఊహించడం కష్టం. 2029 సార్వత్రిక ఎన్నికలకు సమయం ఉన్నప్పటికీ, ప్రధానమంత్రి రేసు చుట్టూ ఇప్పుడే ఆసక్తికరమైన చర్చ మొదలైంది. కాంగ్రెస్ పార్టీకి జాతీయ స్థాయిలో రాహుల్ గాంధీ స్పష్టమైన ప్రధాని ముఖచిత్రం అనడంలో ఎలాంటి సందేహం లేదు. అయితే, కాంగ్రెస్‌కు ఏకపక్షంగా సొంత బలం దక్కక, ప్రాంతీయ మిత్రపక్షాల మద్దతుతోనే కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిన పరిస్థితి వస్తే మాత్రం ప్రధానమంత్రి అభ్యర్థిత్వం అతిపెద్ద చిక్కుముడిగా మారుతుంది. గత చరిత్రను గమనిస్తే, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీ వంటి బలమైన ప్రాంతీయ పార్టీలు రాహుల్ గాంధీ నాయకత్వాన్ని ఏకగ్రీవంగా అంగీకరించడంలో ఎప్పుడూ సంకోచిస్తూనే ఉన్నాయి. ఇలాంటి పరిస్థితుల్లోనే మిత్రపక్షాలకు అందరికీ ఆమోదయోగ్యమైన ఒక సర్వసమ్మత నాయకుడి అన్వేషణ ప్రారంభమవుతుంది. భారత ప్రజాస్వామ్య చరిత్రలో 1996లో హెచ్.డి. దేవేగౌడ, ఐ.కె. గుజ్రాల్ వంటి నాయకులు అనూహ్యంగా ప్రధాని పీఠాన్ని అధిరోహించిన సందర్భాలు ఉన్నాయి. సరిగ్గా ఈ సమీకరణాల్లోనే, తమిళనాడు ముఖ్యమంత్రి , తమిళగ వెట్రి కజగం అధినేత జోసెఫ్ విజయ్ పేరు జాతీయ స్థాయిలో చర్చకు వస్తోంది. సంకీర్ణ రాజకీయాల్లో విపక్ష ప్రాంతీయ పార్టీలు తమ కంటే బలమైన జాతీయ నేతను ప్రధానిగా అంగీకరించడానికి ఇష్టపడవు. అక్కడ వివాదరహితుడు, అందరికీ సర్దుబాటు అయ్యే కొత్త ముఖానికే ఎక్కువ అవకాశాలు ఉంటాయి. ఇటీవల వెలువడిన సర్వేలో ప్రధాని రేసులో నరేంద్ర మోదీ, రాహుల్ గాంధీ తదుపరి స్థానంలో అనూహ్యంగా విజయ్ మూడో స్థానంలో నిలిచారు. ఇది టీవీకే శ్రేణుల్లోనే కాకుండా జాతీయంగా చర్చనీయాంశమైంది. తమిళనాడులోని టీవీకే మంత్రులు, సీనియర్ నేతలు విజయ్ కేవలం తమిళనాడుకే పరిమితం కాదని, ఉత్తరాది ప్రజలు కూడా ఆయన వైపే చూస్తున్నారని వ్యాఖ్యానించడం కాంగ్రెస్-టీవీకే కూటమిలో విభేధాలకు దారితీసింది. విజయ్‌కి ఏ జాతీయ పార్టీతోనూ దీర్ఘకాల శత్రుత్వం లేదు. దక్షిణాదికి చెందిన ప్రజాదరణ పొందిన నాయకుడు కావడం, సిద్ధాంతపరమైన తీవ్రమైన మరకలు లేకపోవడం వల్ల ప్రాంతీయ పార్టీల అధినేతలకు రాహుల్ కంటే విజయ్‌ను ప్రధాని అభ్యర్థిగా మద్దతు ఇవ్వడం సులువుగా మారవచ్చు. విజయ్‌ని ప్రధాని అభ్యర్థిగా ప్రాజెక్ట్ చేయడంపై కాంగ్రెస్ తీవ్రంగా స్పందిస్తోంది. తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు మాణికం ఠాగూర్ దీనిని టీవీకే నేతల ఫ్యాన్ క్లబ్ మానసిక స్థితి గా అభివర్ణించడమే కాక, 2029లో రాహుల్‌ను ప్రధానిగా అంగీకరించకపోతే తమిళనాడు కేబినెట్ నుంచి కాంగ్రెస్ మంత్రులు తప్పుకుంటారని హెచ్చరించే స్థాయికి విభేదాలు వెళ్లాయి.

# అగ్నిధార కథనానికి స్పందన... అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన

పెద్దపల్లి జిల్లా ఎస్ ఈ గంగాధర్ ఆదేశాలతో,
డిఈ రాజబ్రహ్మచారి, ఏడిఈ మల్లేశం క్షేత్రస్థాయి సందర్శన.
విడతలవారీగా ట్రాన్స్ఫార్మర్లకు
భద్రత చర్యలు చేపడతాము.
ప్రజలు సమస్యలను నేరుగా తెలుపవచ్చు.
1912 టోల్ ఫ్రీ నెంబర్ కి 24x7 కాల్ చేయొచ్చు.


రహదారి పక్కనే ట్రాన్స్ఫార్మర్ ..! రక్షణ చర్యలేవి...?

అగ్నిధార పత్రికకు కృతజ్ఞతలు తెలిపిన ప్రజలు.

అగ్నిధారన్యూస్ పెద్దపల్లిదపెద్దపల్లి జిల్లాలోనీ రెండు డివిజన్లు, ఏడు సబ్ డివిజన్లు, 27 సెక్షన్ల, పరిధిలోని ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్లు రహదారి పక్కన పంట పొలాలలో ఇతర జన సమూహాలలో ఎలాంటి రక్షణ చర్యలు లేకుండా ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్లపై సెప్టెంబర్ 3 అగ్నిధార పత్రికలో ప్రచురితమైన.....



రహదారి పక్కనే ట్రాన్స్ఫార్మర్.. రక్షణ చర్యలేవీ..? అనే కథనానికి అధికార యంత్రాంగం కదిలింది. విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ప్రజా ప్రయోజనాల దృష్ట్యా నాలుగు రోజులకే స్పందించారు. పెద్దపల్లి విద్యుత్ శాఖ ఎస్ ఈ వి. గంగాధర్ ఆదేశాల మేరకు, సోమవారం పెద్దపల్లి డి ఈ రాజ బ్రహ్మచారి, ఏడిఈ మల్లేశం పత్రిక కథనంలో తెలిపిన ప్రదేశాలతో పాటు మరికొన్ని ట్రాన్స్ఫార్మర్లను, క్షేత్రస్థాయిలో సందర్శించి పరిశీలించారు. , రహదారి పక్కన పంట పొలాల పక్కన ఉన్న ట్రాన్స్ఫార్మర్ల , పరిస్థితులను ప్రజలకు ఉన్న ప్రమాదాన్ని అంచనా వేశారు. ఈ సందర్భంగా.. పెద్దపల్లి డిఈ రాజబ్రహ్మచారి అగ్నిధారతో మాట్లాడుతూ..... "అగ్నిధార" పత్రికలో వచ్చిన కథనానికి పెద్దపల్లి జిల్లా విద్యుత్ శాఖ అధికారి ఎస్ ఈ గంగాధర్ ఆదేశాల మేరకు సోమవారం పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామం, సుల్తానాబాద్ మండలం పెరికపల్లి గ్రామం, అలాగే, ఓదెల మండలం ఉప్పరపల్లికి వెళ్లే దారిలో ఉన్న కొన్ని ట్రాన్స్ఫార్మర్లను క్షేత్రస్థాయిలో పర్యటించామన్నారు . పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించి అంచన వేశామన్నారు. ప్రమాదకరంగా ట్రాన్స్ఫార్మర్ల చుట్టూ ఫెన్సింగ్, హెచ్చరిక బోర్డులు దశలవారీగా చేపడతామన్నారు. మొదట ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్ఫార్మర్లకు రక్షణ కంచెలు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తాం" అని తెలిపారు.అలాగే ప్రజలు విద్యుత్ సమస్యలు ఎదుర్కొన్నట్లయితే లైన్మెన్, ఏఈ దృష్టికి కానీ తమ దృష్టికి తీసుకురావచ్చని, తమ కార్యాలయంలో సంప్రదించవచ్చని ప్రజలకు సూచించారు. అలాగే 24 గంటలు 1912 టోల్ ఫ్రీ నెంబర్ కి కాల్



చేయవచ్చని తెలిపారు.ప్రజా ప్రయోజనాల కోసం సమస్యను వెలుగులోకి తెచ్చిన అగ్నిధార యాజమాన్యానికి, కథనానికి సత్వరమే స్పందించిన ఎస్ ఈ వి. గంగాధర్, డి ఈ రాజ బ్రహ్మచారి ఏ డి ఈ మల్లేశం లకు ఈ సందర్భంగా రైతులు విద్యాసాగర్ రెడ్డి, మల్లయ్య, నరసయ్య రాము, కృతజ్ఞతలు తెలిపారు.

# భక్తి శ్రద్ధలతో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహా ప్రతిష్టాపన

**దేవుని పడకల్ ఆలయ అభివృద్ధికి 2,30,000 లక్షల తో చేయూత టాస్క్ సి ఓ ఓ ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

తలకొండపల్లి మండలం దేవుని పడకల్ మరియు పడకల్ గ్రామాల్లో శ్రీ పోచమ్మ తల్లి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవా లను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు,ఈ సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లోమాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తో కలిసి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు, దేవుని పడకల్ గ్రామంలోని శ్రీ పోచమ్మ తల్లి ఆలయ అభివృద్ధి కోసం రూ. 2,30,000 రెండు లక్షల ముప్పై వేల రూపాయ లతో ముఖ్యంగా ఆలయానికి అవసరమైన గ్రిల్స్తో పాటు ఇతర సౌకర్యాల కల్పన కోసం ఈ సహకారాన్ని అందించారు,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామాల్లోని ఆలయాలు



ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలకు, సంప్రదాయాలకు ప్రతీకలుగా నిలుస్తాయని, ఆలయాల అభివృద్ధికి తన వంతు సహకారం ఎల్లప్పుడూ కొనసాగిస్తానని తెలిపారు,శ్రీ పోచమ్మ తల్లి అమ్మవారి ఆశీస్సులతో రెండు గ్రామాల ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని, దేవుని పడకల్ మరియు పడకల్ గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి ఆకాంక్షించారు.ఈ కార్యక్రమాల్లో సర్పంచ్లు దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి, కానుగుల అనిత మల్లేష్, ఉప సర్పంచ్ అంబటి వెంకటేశ్, మాజీ సర్పంచ్ కుమ్మరి శంకర్, వార్డు సభ్యులు స్వామి గౌడ్, సీనియర్ నాయకులు తిరుపతి గౌడ్, ఆలయ కమిటీ సభ్యులు కృష్ణయ్య, నరసింహ లతో పాటు గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, యువత, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## జూపల్లి గ్రామంలో ఘనంగా పోచమ్మ బోనాలు..



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

చారగొండ మండలంలోని జూపల్లి గ్రామంలో పోచమ్మ బోనాల పండుగను గ్రామ ప్రజలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలను అలంకరించి, ప్రత్యేక పూజలు నిర్వహిస్తూ పోచమ్మ తల్లికి సమర్పించారు. గ్రామంలోని ప్రధాన వీధుల గుండా మహిళలు బోనాలతో ఊరేగింపుగా తరలివెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. పోచమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, మొక్కులు చెల్లించడంతో ఆలయ పరిసరాలు భక్తులతో సందడిగా మారాయి.ఈ బోనాల వేడుకల్లో గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. గ్రామంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని పోచమ్మ తల్లిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో, సర్పంచ్, అనూష జగపతి,ఉపసర్పంచ్ రియాజ్,, వార్డు సభ్యులు, గ్రామ నాయకులు యువకులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కసిరెడ్డి నీ విమర్శిస్తే సహించేది లేదు

**మాజీ మున్సిపల్ చైర్మన్ పై విరుచుకుపడ్డ కాంగ్రెస్ నాయకులు..**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

కల్వకుర్తి పట్టణంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మీడియా సమావేశాన్ని నిర్వహించారు గత నాలుగు రోజుల క్రితం బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మున్సిపల్ మాజీ చైర్మన్ యడ్మ సత్యం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పై లేనిపోని ఆరోపణలు చేస్తూ మీడియా సమావేశాన్ని నిర్వహించడం జరిగిందని, ముఖ్యంగా బీఆర్ఎస్ పార్టీ నాయకులకు మతిభ్రమించిందని కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు బెక్కర బాల్ రెడ్డి,పట్టణ అధ్యక్షులు పుస్తకాల రాహుల్ విమర్శించారు, గత పది సంవత్సరాల నుండి కల్వకుర్తి నియోజకవర్గంలో ఏ ఒక్క డబల్ బెడ్ రూమ్ ఇళ్లను ప్రారంభించలేదని కసిరెడ్డి నారాయణరెడ్డి అనడం జరిగిందని ఆ మాటల్లో వాస్తవం ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. కల్వకుర్తి కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ మాట్లాడుతూ కల్వకుర్తి మున్సిపాలిటీ పరిధిలో 240 డబుల్ బెడ్రూం నిర్మించి అసంపూర్తిగా పెట్టి గత రెండు, మూడు ఎన్నికల్లో అమాయక ప్రజలను డబల్ బెడ్ రూమ్ లపై పై ఆశ చూపించి అప్పటి ఎన్నికల్లో గెలవడం జరిగిందని,240 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలో అసంపూర్తిగా ఉన్నాయి, అసంపూర్తిగా పెట్టుకొని మీ ప్రభుత్వంలో డ్రాలు తీసి ఓట్ల కోసం నిరుపేదలకు మోసం చేసింది మీరు కాదా... డబల్ బెడ్ రూమ్ ఇళ్లలో కనీస సౌకర్యాలు లేక అసంపూర్తిగా ఉన్నప్పుడు మీరు ఓట్ల కోసం డబల్ బెడ్ రూమ్ ఇల్లు చూయించి ఓట్లను దండుకున్నది వాస్తవం కాదా.. 2023లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి ఆధ్వర్యంలో 240 ఇండ్లకు అసంపూర్తిగా ఉన్న ఇండ్లలో డ్రైనేజీ వ్యవస్థ మరియు విద్యుత్ సరఫరా వంటి పనులు చేయించి డబల్ బెడ్ రూమ్ ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని పుస్తకాల రాహుల్ గుర్తు చేశారు.

కల్వకుర్తి నియోజకవర్గం లో పాత కాంగ్రెస్, కొత్త కాంగ్రెస్ అని ఆలోచనలు కాంగ్రెస్ పార్టీలో లేవని అందరం కలిసికట్టున పనిచేస్తున్నామని అన్నారు ప్రస్తుతం ఉన్న కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎమ్మెల్యే ఎన్నికల ముందు వేరే పార్టీల నుండి కలవడం జరిగిందని ఎమ్మెల్యే, ఎంపీ,మున్సిపాలిటీ ఎన్నికల్లో అందరం కలిసి పనిచేసే కాంగ్రెస్ పార్టీ విజయానికి కృషి చేశారని, మన ప్రాంతవాసేన ఎనుముల రేవంత్ రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని ఉద్దేశంతో అందరూ శాయశక్తుల కృషి చేశామని అన్నారు, మీలాగా అధికారం వచ్చిన తర్వాత



పార్టీలో కలిసే సంస్కృతి మాకు లేదని పుస్తకాల రాహుల్ విమర్శించారు...కసిరెడ్డి నారాయణరెడ్డి పై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదని కాంగ్రెస్ పార్టీ నాయకురాలు రేష్మ నజ్మిన్ అన్నారు, మాజీ మున్సిపాలిటీ చైర్మన్ సత్యం మీరు దాదాపుగా అన్ని పార్టీలు మారి పార్టీలు మారని వ్యక్తుల వ్యవహరించడం సిగ్గుచేటు అని డిసిసి కార్యదర్శి లింగారెడ్డి అన్నారు.కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా నాయకులు నిజాముద్దీన్,వెంకటాపూర్ ఉప నంబూ ఇస్తారీ,కాంగ్రెస్ పార్టీ నాయకులు వర్కల భాస్కర్ రెడ్డి, రేష్మ బేగం, మాజీ సర్పంచ్ రాకేష్ శర్మ, జైపాల్ రెడ్డి, భాస్కర్, సంతోష్,యువజన కాంగ్రెస్ నాయకులు,వంశీ,పడకంటి వెంకటేష్,దున్న సురేష్,కుమార్,తది తరులు పాల్గొన్నారు.

## శ్రీ ఉమా మహేశ్వర స్వామి ప్రతిష్టాపనలో సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి



**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**


కడ్తల్ మండలంలోని నార్లకుంట తండాలో నిర్వహించిన శ్రీ ఉమా మహేశ్వర స్వామి విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవంతో పాటు.కడ్తల్ పట్టణంలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు,ఈ సందర్భంగా నార్లకుంట తండాలో భక్తిశ్రద్ధలతో నిర్వహించిన శ్రీ ఉమా మహేశ్వర స్వామి విగ్రహా ప్రతిష్టాపన మహోత్సవంలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించి, ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు,అనంతరం కడ్తల్ పట్టణంలో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, ఈ సందర్భంగా ప్రజలందరికీ అమ్మవారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని, పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామాలు అభివృద్ధి పథంలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు,ఆలయాలు, పండుగలు మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని.. ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రజల్లో భక్తిభావంతో పాటు ఐక్యతను మరింత బలపరుస్తాయని సుంకిరెడ్డి రాఘువేందర్ రెడ్డి పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో నార్లకుంట తండా సర్పంచ్ రామచందర్, ఉప సర్పంచ్ రవీంద్ర, మాజీ సర్పంచ్ పూజా దేవి, కడ్తల్ వార్డు సభ్యులు నాగరాజు, భాను కిరణ్, నాగరాజు, శ్రీను, భావోజీ రెక్యా, సీనియర్ నాయకులు రమేష్, తల్లోజు రఘు, ఎగిరిశెట్టి లింగం, ప్రవీణ్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ 420 హామీలపై ప్రజావాణిలో తహసిల్దార్ కి ఫిర్యాదు

**బీఆర్ఎస్ పార్టీ మాజీ ఇంచార్జ్ విజితా రెడ్డి,**

**అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)**

వెల్దండ మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆదేశాల మేరకు కల్వకుర్తి బీ ఆర్ఎస్ పార్టీ మాజీ ఇంచార్జ్ డాక్టర్ విజిత రెడ్డి, ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ 420 హామీలపై భగ్గుమన్న బిఆర్ఎస్ శ్రేణులు,బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం నుండి కార్యకర్తలు ర్యాలీగా బయలుదేరి ఎంపీడీవో కార్యాలయంలో ప్రజావాణిలో ఎంపీడీవో సులోచన కు 420 హామీలపై బిఆర్ ఎస్ శ్రేణులు వినతిపత్రం సమర్పించారు. కల్వకుర్తి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజితా రెడ్డి, మాట్లాడుతూ, కాంగ్రెస్ పాలనలో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలపైబిఆర్ఎస్ కార్యకర్తలు కదం తొక్కా రు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మహాలక్ష్మి పథకం కింద నెలకు రూ 2500, తులం బంగారం, అందించాలని అదేవిధంగా ఆడబిడ్డలకు రక్షణ కల్పించాలని కోరారు. రైతన్నలకు ప్రతి పంటకు రైతు భరోసా కింద ఎరువుల పంపిణి, రైతులకు 24 గంటల నిరంతర ఉచిత విద్యుత్తు, రైతు కూలీలకు సంవత్సరానికి రూ 12000 సహాయం, ఇల్లు లేని ప్రతి నిరుపేదలకు ఇంటి స్థలంతోపాటు ఇందిరమ్మ ఇల్లు నిర్మించి ఇవ్వాలని కోరారు. వృద్ధులకు వితంతువులకు 4 000 పెన్షన్



అందించాలి. ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ 12,000 రూపాయలు, బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీలకు ఇవ్వాలని ఈ సందర్భంగా కోరారు. ప్రభుత్వ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అడుగుతే అక్రమ కేసులు బనాయిస్తున్నారు. అదేవిధంగా అక్రమ కేసులు వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో,మాజీ బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కానుగుల జంగయ్య ,మాజీ సర్పంచ్ అరుణ ప్రభాకర్, వెల్దండ మాజీ ఉపసర్పంచ్ జంగిలి నిరంజన్, మాజీ ఎంపీటీసీ లుజ్యోతి నిరంజన్, లింగం, మాజీ సర్పంచ్ శేఖర్, గండికోట రాజు, అంజి మాస్టర్, గ్రామ వార్డు సభ్యులు శేఖర్, జంగిలి ఆనంద్, పోలే అశోక్, జంగిలి ప్రవీణ్, గోక మల్ల రాజు, కుప్పగండ్ల బాలకృష్ణయ్య, జంగిలి రవి, పిల్లి శీను, తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌కు ఎమ్మెల్సీ మధు బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**కరీంనగర్ :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా బెజ్జంకి మండల కేంద్రంలో పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగ ఎమ్మెల్సీ తాతా మధు, కేసీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.అనంతరం మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల రంగు టీ షర్టు, వాటిపై అసభ్యకరంగా రాసి ఉండటం వల్లలో పోలీసులు వారిని అసెంబ్లీలోకి వెళ్లకుండా గేటు వద్ద అటకాయించారని, ఈ క్రమంలో పోలీసులను, స్పీకర్ ను ఎమ్మెల్సీ మధు ధూషణలకు దిగారని, అతడి సభ్యత్వాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా వెంటనే స్పీకర్ కు బేషరతుగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

# ఆలయం నిర్మాణానికి ఆర్థిక సహాయం

ప్రారంభోత్సవంలో పాల్గొన్న సర్పంచ్ దోకూరి సునీత ప్రభాకర్ రెడ్డి దంపతులు.

అగ్నిధారన్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండలంలోని పడకల్ గ్రామంలో పోచమ్మ తల్లి నూతన ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, హోమం, యాగం వంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామస్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ ఆలయ నిర్మాణానికి గ్రామ సర్పంచ్, మాజీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోకూరి సునీత--ప్రభాకర్ రెడ్డి దంపతులు తమ వంతు సహకారాన్ని అందించారు. సుమారు 12 లక్షల వ్యయంతో ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయడంతో పాటు, హోమం, యాగం కార్యక్రమాల ఖర్చులను కూడా వారు భరించారు. ఇచ్చిన మాట ప్రకారం ఆలయ నిర్మాణాన్ని పూర్తి చేయించిన దంపతుల సేవాభావాన్ని గ్రామస్తులు అభినందించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, గ్రామంలో పోచమ్మ తల్లి ఆలయ నిర్మాణానికి ముందుకు వచ్చి, పెద్ద మొత్తంలో ఆర్థిక సహాయం అందించి ఆలయాన్ని పూర్తి చేయించిన దోకూరి సునీత--ప్రభాకర్ రెడ్డి దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. పోచమ్మ తల్లి ఆశీస్సులు గ్రామ ప్రజలందరిపై ఉండాలని, గ్రామం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఆరు గ్యారంటీలు.. 420 హామీలు అమలు చేయాలి



22-ఏ నిషేధిత జాబితా నుంచి రైతుల భూములు తొలగించాలి

అగ్ని ధార న్యూస్ ,(బెల్లంపల్లి) :

కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారంటీలు, 420 హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పోరుబాట చేపట్టారు. బీఆర్ఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.తారకరామారావు ఆదేశాలు, మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య సూచనల మేరకు బెల్లంపల్లి మండల ప్రజావాణిలో సోమవారం వినతిపత్రం సమర్పించారు.

ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తక్షణమే అమలు చేయాలని, 22-ఏ నిబంధనల కింద నిషేధిత జాబితాలో చేర్చిన రైతుల భూములను వెంటనే తొలగించి రిజిస్ట్రేషన్‌కు అవకాశం కల్పించాలని వారు కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## అసెంబ్లీ ముట్టడిలో కందుల సంధ్యారాణి అరెస్ట్



అక్రమ అరెస్టులతో ప్రజా పోరాటాన్ని అణచలేరు

అగ్ని ధార న్యూస్ ,(హైదరాబాద్) :

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్‌రావు పిలుపు మేరకు చేపట్టిన 'చలో అసెంబ్లీ' కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి, ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణిని పోలీసులు అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద అరెస్ట్ చేశారు. అనంతరం మాదన్నపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతును అణచివేయడం ప్రభుత్వానికి సాధ్యం కాదన్నారు. శాంతియుతంగా ఆందోళన చేస్తున్న బీజేపీ నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి నిర్బంధించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. అక్రమ అరెస్టులు, నిర్బంధాలతో ప్రజా పోరాటాన్ని నిలువరించలేరని స్పష్టం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం పోరాడుతుందని తెలిపారు.

## తుడుందెబ్బ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ.
## జాతీయ రహదారిపై రాస్తారోకో

**ములుగు** : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలకేంద్రంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఏటూరునాగారం బస్టాండ్ నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి, ఐటీడీఏ ఎదురుగా జాతీయ రహదారిపై రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా తుడుందెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మైపతి అరుణ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వాలు ఆదివాసులకు విద్యా, ఉద్యోగాల్లో తీవ్ర జాప్యం చేస్తున్నాయని ఆరోపించారు. షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసులకు ఉద్యోగాలు కల్పించాలని, ఏజెన్సీ డీఎస్సీ ద్వారా ఏజెన్సీ సర్టిఫికెట్ ఆధారంగా ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఏటూరునాగారం ఐటీడిఏ పీవో కి అందజేశారు. 1976 నుండి 50 ఏళ్లుగా రాజ్యాంగ సవరణ లేకుండా ఎస్టీ జాబితాలోకి వచ్చి లంబాడీలు రిజర్వేషన్లు పొందుతున్నారని, వారిని ఎస్టీ జాబితా నుండి తొలగించాలని, ఇందుకోసం జ్యుడీషియల్ కమిషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. గోదావరి జలాలను సిద్దిపేట, సిరిసిల్ల, మహబూబ్ నగర్ తదితర జిల్లాలకు తరలిస్తున్నారని, స్థానిక ఏజెన్సీ మండలాలకు చుక్క నీరు కూడా ఇవ్వడం లేదని ఆరోపించారు. ఐటీడీఏ ద్వారానే పరిపాలన కొనసాగించాలని, లేనియెడల లక్షలాది మందితో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో గిరిజనులు, తుడుందెబ్బ నాయకులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి నీ విమర్శించడం సరికాదు

యువజన కాంగ్రెస్ నాయకులు మేకల కురుమయ్య

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

వచ్చే తెలంగాణ శాసన సభ ఎన్నికల్లో కల్వకుర్తి గడ్డపై ఎగిరేది కాంగ్రెస్ పార్టీ జెండానే అని కాంగ్రెస్ పార్టీ యువనాయకులు మేకల కురుమయ్య పేర్కొన్నారు. కల్వకుర్తి నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో పయనిస్తున్న కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డిని విమర్శించడం సరికాదు అన్నారు. కల్వకుర్తిలో చేపట్టిన ర్యాలీలో బీఆర్ఎస్ నేతలు అబద్ధాలతో ప్రజలను మభ్యపెట్టాలని చూస్తున్నారని విమర్శించారు. కల్వకుర్తి నియోజకవర్గ ప్రజలు తెలివైనవారని అసత్య ప్రచారాలను తిప్పికొడతారని తెలియజేశారు. బీఆర్ఎస్ నాయకులకు దమ్ముంటే వారి హయాంలో ఏమేమేం అభివృద్ధి చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఇచ్చిన హామీలు దళిత సీఎం, దళితులకు మూడెకరాల భూమి, నిరుద్యోగ భృతి, కేజీ టు పీజీ ఉచిత నిర్బంధ విద్య, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఎన్ని నెరవేర్చారో తెలుసుకోవాలని గుర్తుచేశారు. పదేళ్లు ఫీజ్ రీయింబర్స్ మెంట్ చెల్లించకుండా విద్యార్థుల ఉసురు పోసుకున్నారని దుయ్యబట్టారు. తెలంగాణ అమరులను, ఉద్యమకారులను అవమానించిన నీచపు సంస్కృతి బీఆర్ఎస్ పార్టీదే అని అన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకులు కల్లబొల్లి మాటలు చెబుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద విషప్రచారం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని హెచ్చరించారు. ప్రజా ప్రభుత్వ పాలనలో 1000 రోజుల సంక్షేమం ప్రజల వద్దకు చేరిందని చాటి చెప్పారు. గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్ రెడ్డి రోజుకు 18 గంటలు పనిచేస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నాయకులు మేకల కురుమయ్య కొనియాడారు.

## హామీల అమలుపై ప్రజావాణిలో బీఆర్ఎస్ ఫిర్యాదులు




అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్/గండీడ్ :

కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదులు చేశారు కార్యాచరణ చేపట్టారు. పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్‌రెడ్డి ఆదేశాల మేరకు ఉదయం 10 గంటలకు మహమ్మదాబాద్/ గండీడ్ మండలంలోని ఎంపీడీవో కార్యాలయాల్లో జరిగే ప్రజావాణికి అర్హులైన లబ్ధిదారులు ఫిర్యాదులు చేశారు పింఛన్లు అందని వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులతో పాటు కళ్యాణలక్ష్మి, షాదీముబారక్, ఇందిరమ్మ ఇల్లు, రైతుబంధు, రైతుభరోసా పథకాలు అందని వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లనున్నారు. ఎన్నికల ముందు ప్రకటించిన పింఛన్ల పెంపు, రైతుభరోసా పెంపు, కళ్యాణలక్ష్మికి తులం బంగారం, రైతుల రుణమాఫీ, నిరుద్యోగులకు ఉద్యోగాలు, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, మహిళలకు నెలకు రూ.2,500, ఆడపిల్లలకు స్కూటీల హామీలను అమలు చేయాలని ప్రజావాణి ద్వారా డిమాండ్ చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత, పార్టీ ప్రెసిడెంట్లు డి.గోపాల్, పెంట్యా నాయక్,మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, నంచర్ల సర్పంచ్ సుంకిరెడ్డి గాయత్రీ దేవి, మణికమ్మ, మాజీ సర్పంచులు, వెంకట్ రామ్ రెడ్డి, రఘుయాదవ్, మాజీ ఎంపీటీసీలు, మాజీ పీఏసీఎస్ డైరెక్టర్లు, బీఆర్ఎస్ నాయకులు బిక్షపతి, రామచంద్ర రెడ్డి,సాయి రెడ్డి, తిరుమలరెడ్డి, బి రాజు, బాలవర్ధన్ రెడ్డి, కృష్ణ,కేశవులు, అంజయ్య, శ్రీను, సాయి,కార్యకర్తలు మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని

## ప్రజల దాహార్తి తీర్చడానికి బోర్ వెల్స్

అగ్నిధార న్యూస్ మహమ్మదాబాద్:



చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి ఎంపీ లాడ్స్ (ఎంపీ ఎల్‌ఏడిఎస్) నిధుల ద్వారా మహమ్మదాబాద్ మండల కేంద్రానికి మంజూరైన 3 కొత్త బోర్‌వెల్స్‌లో భాగంగా గురువారం మొదటి బోరు తవ్వకం పనులు విజయవంతంగా పూర్తయ్యాయి. బిజెపి రాష్ట్ర నాయకులు డాక్టర్ వెన్న ఈశ్వరప్ప ప్రత్యేక చొరవతో, వారి సమక్షంలో ఈ బోరు తవ్వకం పనులను ప్రారంభించారు. తవ్వకంలో నీరు సమృద్ధిగా పడటంతో కాలనీవాసులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆనందం వ్యక్తం చేశారు. వేసవి రాకముందే నీటి తిప్పలు తీర్చేలా ఎంపీ నిధులు కేటాయించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రానికి 3 బోర్లను మంజూరు చేసిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి, పనులను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న డాక్టర్ వెన్న ఈశ్వరప్పకు గ్రామస్తులు, కాలనీవాసులు, బిజెపి మండల నాయకులు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మిగిలిన బోర్ల తవ్వకం ప్రక్రియను కూడా త్వరలోనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని నాయకులు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో.గ్రామ సర్పంచ్. రాంలాల్. ఉప సర్పంచ్. ఈ. పవన్ కుమార్.. మండల అధ్యక్షులు మూస నర్సింలు, మండల సీనియర్ నాయకులు కురువ కృష్ణ, మండల ప్రధాన కార్యదర్శి పవన్. కాశినాథ్. తిరుమలేష్. హరీష్. తిరుపతి రెడ్డి. హరి ప్రసాదం. అనిల్.మరియు బిజెపి మండల నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికవార్డ్ సభ్యులు ప్రజలు పాల్గొన్నారు.

## పోచమ్మ ఆలయానికి విరాళం



నిర్వాహకులకు చెక్కు అందజేసిన డిసిసిబి చైర్మన్ గంప వెంకటేష్

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీకగా బోనాల సంబురాలు నిర్వహించడం జరుగుతుందని ఉమ్మడి మహబూబ్ జిల్లా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా అన్నారు. బోనాల వేడుకలను పురస్కరించుకొని కడ్తాల్ పట్టణంలోని పోచమ్మ ఆలయానికి రూ. 30,000 వేల విరాళాన్ని గంప లక్ష్మయ్య చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గంప వెంకటేష్ గుప్తా కమిటీ అధ్యక్షుడు గొల్ల సత్యం మెంబర్లకు అందజేశారు. అనంతరం బోనాల ఉత్సవాల్లో ముఖ్యఅతిథిగా ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక అయిన బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా మహిళలు సాంప్రదాయ దుస్తులతో నెత్తిపై బోనంతో ఊరేగింపుగా దేవాలయానికి చేరుకున్నారు. నైవేద్యంగా బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లక్ష్మీనరసింహారెడ్డి, మాజీ జెడ్పిటిసి దశరథ్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు కంబాలపల్లి పరమేష్, ఆలయ సభ్యులు నాయకులు కార్తీక్, చేగురి రాములు, మల్లేష్ గౌడ్, రాంచందర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధుపై చర్యలు తీసుకోవాలి..

మాజీ జెడ్పీటీసీ హరిదాసు డిమాండ్

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)



రాజ్యాంగబద్ధమైన గౌరవ ప్రదమైన పదవిలో ఉన్న శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు, అసభ్య పదజాలం ఉపయోగించడాన్ని మాజీ జెడ్పీటీసీ హరిదాసు తీవ్రంగా ఖండించారు. స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యలు కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదని, రాజ్యాంగ వ్యవస్థను, శాసనసభ గౌరవాన్ని అవమానించడమేనని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో స్పీకర్ పదవికి ప్రత్యేకమైన గౌరవం ఉంటుందని, అలాంటి రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్‌ను అసభ్య పదజాలంతో దూషించడం బీఆర్ఎస్ పార్టీ అహంకార ధోరణికి, దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనమని హరిదాసు విమర్శించారు. పదవుల అహంకారంతో ప్రతిపక్ష నాయకులు విచక్షణ కోల్పోయి మాట్లాడటం సరికాదన్నారు. రాజ్యాంగబద్ధ పదవుల్లో ఉన్న వారిని గౌరవించడం ప్రతి ఒక్కరి కనీస బాధ్యత అని, దళిత స్పీకర్‌ను అవమానించడం అంటే దళిత సమాజం మొత్తాన్ని అవమానించినట్టేనని ఆయన స్పష్టం చేశారు. తాతా మధుసూదన్ వెంటనే తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కు, దళిత సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## అసెంబ్లీలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలపై దాడికి నిరసన



పాల్గొన్న మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

తలకొండపల్లి మండల కేంద్రంలో బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలును అసెంబ్లీ ఆవరణలోనికి రానివ్వకుండా కాంగ్రెస్ సర్కారు, రేవంత్ రెడ్డి ప్రభుత్వం పోలీసులు పెట్టీ అడ్డుకొని మాజీ మంత్రివర్యులు కేటీఆర్ పైన, హరీష్ రావు పైన మరియు ఎమ్మెల్యేల పైన దాడిని ఖండిస్తూ బిఆర్ఎస్ పార్టీ నాయకులతో కలిసి ధర్నా కార్యక్రమం నిర్వహించిన మిషన్ భగీరథ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ ఉప్పల వెంకటేష్ ఈ సందర్భంగా ఉప్పల వెంకటేష్ మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలు 420 హామీలు హామీలను అమలు చేయమని అసెంబ్లీలో ప్రశ్నించడానికి వెళితే పోలీసుల చేత అడ్డుకున్నటువంటి దుర్మార్గపు ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని ఉప్పల వెంకటేష్ ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో,స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు తది తరులు పాల్గొన్నారు.

## హిందీ ఉపాధ్యాయుడికి ఉత్తమ అవార్డు

క్లాస్ మేట్ ఆధ్వర్యంలో నరసింహ కి సన్మానం

అగ్ని ధార న్యూస్ (కల్వకుర్తి)

కల్వకుర్తి క్లాస్‌మేట్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా స్థాయి కార్య క్రమంలో హిందీ సబ్జెక్టులో ఉత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయుడికి జిల్లా ఉత్తమ అవార్డును ప్రదానం చేశారు. మండలంలోని మార్చాల జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న నర్సింహులు ఈ అవార్డుకు ఎంపికయ్యారు. గత విద్యా సంవత్సరంలో పదో తరగతి విద్యార్థులకు హిందీ సబ్జెక్టులో మెరుగైన ఫలితాలు సాధించేలా నర్సింహులు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఆయన బోధనలో ఐదుగురు విద్యార్థులు హిందీలో 97 మార్కులు సాధించడం విశేషం. విద్యార్థుల ప్రతిభను వెలికితీసి, ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేసినందుకు ఆయన సేవలను గుర్తిస్తూ క్లాస్‌మేట్ క్లబ్ జిల్లా స్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ, విద్యార్థుల విజయమే తనకు నిజమైన అవార్డని అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉపాధ్యాయుల సూచనలు పాటిస్తే ఉన్నత ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. తనను జిల్లా ఉత్తమ అవార్డుకు ఎంపిక చేసిన క్లాస్‌మేట్ క్లబ్ నిర్వాహకులకు, సహచర ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఆళ్లగడ్డ లో గణేష్ ఉత్సవాలు
## అందరూ సహకరించాలి.. సి. ఐ

**ఆళ్లగడ్డ** ఆళ్లగడ్డ పట్టణంలో గణేష్ ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా అన్ని మతాల పెద్దలు, ప్రజలు సహకరించాలని ఆళ్లగడ్డ టౌన్ సీఐ నాగరాజరావు కోరారు. సోమవారం సాయంత్రం టౌన్ పోలీస్ స్టేషన్ ఆవరణలో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. గణేష్ విగ్రహాల ఏర్పాటుకు సింగిల్ విండోలో ప్రత్యేక పోర్టల్ ద్వారా అనుమతి పొందాలన్నారు. గణేష్ మంటపాల దగ్గర అశ్లీల నృత్యాలు, డీజే లు నిషిద్ధమన్నారు. గణేష్ ఉత్సవాలలో ఈవ్ టీజింగ్ లాంటి చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ నాగరాజు రావ్ హెచ్చరించారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు వహించాలని గణేష్ ఉత్సవ కమిటీలకు సూచించారు. నిమజ్జన కార్యక్రమం సాయంత్రం లోగా పూర్తయ్యేలా చూసుకోవాలని సీఐ నాగరాజరావు విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది విజయభాస్కర్ రెడ్డి, ముస్లిం మత పెద్ద అమీర్ భాష,

# సమ్మె నోటీసుతోనే సమస్యలపై ఒప్పందం

**ఒప్పందంపై అవగాహన లేకుండా విమర్శలు చేయడం విడ్డూరం: ఏఐటీయూసీ నేతలు**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం) :**

సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటీయూసీ ఇచ్చిన సమ్మె నోటీసు కారణంగానే 24 డిమాండ్లపై యాజమాన్యంతో ఒప్పందం కుదిరిందని ఏఐటీయూసీ సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అన్నారు. సోమవారం ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-1 ఇంక్లైన్, ఓసీపీ-5 గనుల వద్ద నిర్వహించిన గేట్ మీటింగ్‌లలో ఆయన మాట్లాడారు. జూన్ 8న 31 డిమాండ్లతో సమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం ప్రాంతీయ కార్మిక కమిషనర్ సమక్షంలో పలుమార్లు చర్చలు జరిగాయని, వాటి ద్వారా అనేక డిమాండ్లపై సానుకూల నిర్ణయాలు సాధించామని తెలిపారు. తాడిచెర్ల-2 బ్లాక్, మణుగూరు ఓసీపీ-2 డీప్‌సైడ్ బ్లాక్‌ల సాధన కూడా ఏఐటీయూసీ పోరాట ఫలితమేనని పేర్కొన్నారు. ఏఐటీయూసీ రెండేళ్లలోపు ఒప్పందం కుదుర్చుకుని కార్మికుల హక్కులు సాధిస్తుంటే కొన్ని సంఘాలు ఓర్వలేక అవగాహన లేకుండా విమర్శలు చేస్తున్నాయని ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లాగౌడ్, కందికట్ల వీరభద్రం విమర్శించారు. గతంలో గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ 11 ఏళ్లలో ఒక్క అగ్రిమెంట్ కూడా చేయలేదని ఆరోపించారు.



కార్యక్రమంలో ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్‌బాబు, పెర్క మహేందర్, కలవేణి రాజేశ్, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలి

**సెప్టెంబరు 25న పెద్దపల్లిలో ఏఐకేఎంఎస్ తొలి మహాసభ**

**అగ్ని ధార న్యూస్ ,(అంతర్గాం,):**

రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు ప్రభుత్వాలు శాశ్వత పరిష్కారం చూపాలని అఖిల భారత రైతు కూలీ సంఘం (ఏఐకేఎంఎస్) నాయకులు డిమాండ్ చేశారు. రైతు సమస్యలపై సమగ్రంగా చర్చించి భవిష్యత్ కార్యాచరణ రూపొందించేందుకు సెప్టెంబరు 25న పెద్దపల్లి ప్రెస్‌క్లబ్‌లో ఏఐకేఎంఎస్ తొలి మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం అంతర్గాం మండల కేంద్రంలో మహాసభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా అధ్యక్షుడు ఎల్. భీమన్న, ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు దామక లక్ష్మణ్, ఇతర నాయకులు మాట్లాడుతూ పంటలకు గిట్టుబాటు ధరలు లేకపోవడం, సాగు ఖర్చులు పెరగడం, నాణ్యమైన విత్తనాలు, ఎరువుల కొరత, సాగునీటి సమస్య, పంట నష్టపరిహారం ఆలస్యం, రైతులపై అప్పుల భారం వంటి సమస్యలతో వ్యవసాయ రంగం సంక్షోభంలో ఉందన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు ప్రతి పంటకు కనీస మద్దతు ధర కల్పించాలని, గిట్టుబాటు ధరకు చట్టబద్ధమైన హామీ ఇవ్వాలని కోరారు. నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందులను అరికట్టి నాణ్యమైన ఇన్‌పుట్స్ అందించాలని, కౌలు రైతులను గుర్తించి రైతు సంక్షేమ పథకాలు, రుణాలు, పంట నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేసి ప్రతి ఎకరాకు నీరు అందించాలని, ప్రకృతి వైపరీత్యాలతో నష్టపోయిన రైతులకు తక్షణ పరిహారం చెల్లించాలని, రైతు ఆత్మహత్యలను నివారించేందుకు బాధిత కుటుంబాలకు ఆర్థిక సహాయం, పునరావాసం కల్పించాలని కోరారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి, కనీస వేతనం, సామాజిక భద్రత కల్పించడంతో పాటు భూమి హక్కుల సమస్యలను పరిష్కరించాలని అన్నారు. దసెప్టెంబరు 25న ఉదయం 10 గంటలకు జరిగే మహాసభకు పెద్దపల్లి జిల్లాతో పాటు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి రైతులు, కౌలు



రైతులు, మహిళా రైతులు, వ్యవసాయ కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె. విశ్వనాథ్, పుష్పక దేవయ్య, ఇందారపు రాజపోషం, రమేష్, లక్ష్మణ్, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే రాజీనామా చేయాలి

**గజ్వేల్ బి ఆర్ ఎస్ ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ ఫీజు రియంబర్స్మెంట్ 12 వేల కోట్లు బకాయిలు చెల్లించలేని, యూత్ డిక్లరేషన్ అమలు చేయలేని అసమర్ధ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలి.

**గజ్వేల్ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్ రెడ్డి**

సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు యువతకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేని పక్షంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ అంబేద్కర్ విగ్రహం నుండి వేలాదిమంది విద్యార్థులతో కలిసి భారీ ఎత్తున ర్యాలీ నిర్వహించడం. అడుగడుగునా విద్యార్థులు రేవంత్ రెడ్డి హామీలను నెరవేర్చాలని నినాదించారు లేనిపక్షంలో, విద్యాశాఖ మంత్రిగా తప్పుకొని ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అసమర్ధ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనలో విద్యారంగం విధ్వంసం అయిందన్నారు, ప్రతి సంవత్సరం చదువుకున్న యువతకు రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామన్న రేవంత్ రెడ్డి నిరుద్యోగులకు వెన్నుపోటు పొడిచారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి పాలనలో పేద విద్యార్థుల తల్లిదండ్రులపై భారం మోపుతూ దాదాపు 12 వేల కోట్లకు పైగా ఫీజు రియంబర్స్మెంట్ బకాయిలు ఉన్నాయని వాటిని చెల్లించకుండా ఎగనామం పెడుతున్నారని మండిపడ్డారు,

మొదటి సంవత్సరంలోనే 2 లక్షల ఉద్యోగాలు ఇస్తాను రేవంత్ రెడ్డి మాట తప్పి నిరుద్యోగులను చేస్తూ ఇప్పటివరకు మూడు సంవత్సరాల కాలంలో ఐదు లక్షల ఉద్యోగాలు నోటిఫికేషన్ వేయకుండా చదువుకున్న యువత జీవితాలతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. 30 వేల ప్రభుత్వ పాఠశాలలను మూసివేసేందుకు రేవంత్ రెడ్డి కుట్రలు చేస్తున్నారని మండిపడ్డారు. పాలిటెక్నిక్ విద్యార్థుల కోసం తీసుకువచ్చిన 97 జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు, జీవో 97 తో విద్యార్థుల భవిష్యత్తు అంధకారం చేసి మొత్తం పాలిటెక్నిక్ విద్యను ప్రైవేటు పరం చేసి డబ్బులు దండుకోవాలని రేవంత్ రెడ్డి కుట్రలు పన్నుతున్నారని మండిపడ్డారు. చదువుకున్న విద్యార్థినిలకు స్కూటీలు పంపిణీ చేస్తామని చెప్పి విద్యార్థినులను మోసం చేసిన అసమర్ధుడు రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. విద్యా విదేశీ పథకాన్ని నీర్వీర్యం చేశారని మండిపడ్డారు. వెయ్యి రోజుల రేవంత్ రెడ్డి పాలనలో 1000 గురుకులాలు విధ్వంసం అయ్యాయని తెలిపారు. కెసిఆర్ గురుకుల విద్యార్థులను ఎవరెస్ట్ చెక్ ఇస్తే అసమర్ధ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సరైన నాణ్యమైన తిండి పెట్టక విద్యార్థులను పాడెను ఎక్కించిన ఘనత అర్ధ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి దక్కుతుందన్నారు. జాబ్ లెస్ కేలండర్ గా మారిన ముఖ్యమంత్రి జాబ్ క్యాలెండర్ దేవ చేశారు. 4000 నిరుద్యోగ భృతి పేరిట ప్రతి విద్యార్థికి ఇస్తామని చెప్పి నయవంచన గురి చేస్తున్నారని మండిపడ్డారు. యూత్ కమిషన్ పెట్టి పది లక్షల వడ్డీ లేని రుణం ఇస్తామని చెప్పి మోసం చేసిన ఘనుడు రేవంత్ రెడ్డి అని మండిపడ్డారు. 25వేల టీచర్ పోస్టులతో మెగా డీఎస్సీ




వేయకుండా టెట్ పేరిట కాలయాపన చేస్తూ టీచర్ పోస్టుల నోటిఫికేషన్ వేస్తాలేరని మండిపడ్డారు. కేసీఆర్ ఇచ్చిన 65 వేల నోటిఫికేషన్లను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తానే ఇచ్చినట్లు అబద్దాలు అసత్యాలు చెప్పడం మానుకోవాలని హెచ్చరించారు. యూత్ డిక్లరేషన్ల పేరిట, నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తామన్న రాహుల్ గాంధీ పత్తాలేరని మండిపడ్డారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో వచ్చిన వెంటనే గజ్వేల్ ఎడ్యుకేషన్ బాల బాలికల విభాగంలో పెండింగ్లో ఉన్న పనులను పూర్తిచేసే ఎడ్యుకేషన్ హబ్ రూపురేఖలను మార్చి మరింతగా హాస్టల్ వసతులను కల్పిస్తామని భరోసాని ఇచ్చారు, విద్యార్థులకు డైట్ కాస్మెటిక్ ఛార్జ్ లను పెంచుతామన్నారు. విద్యార్థులకు నాణ్యమైన పోషకాలతో కూడిన భోజనాలను అందిస్తామన్నారు, వేరే గ్రామాల నుండి వచ్చి వెళ్ళే విద్యార్థులకు ప్రతి గ్రామానికి బస్సు సౌకర్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు.

## హోంగార్డు నవీందర్‌కు ఎస్ ఐ కృష్ణా రెడ్డి ఘన సన్మానం

**అగ్నిధార న్యూస్ సంగారెడ్డి జిల్లా**

నుండి ఆర్డర్ తో సెర్వె కింద సిద్దిపేట జిల్లాకు వచ్చి, గత సంవత్సరం కాలంగా జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన హోంగార్డు ఎస్ . నవీందర్ తన విధి కాలాన్ని విజయవంతంగా పూర్తి చేసుకుని స్వంత జిల్లాకు తిరిగి వెళ్తున్న సందర్భంగా సోమవారం జగదేవ పూర్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా జగదేవ్‌పూర్ ఎస్ఐ జె కృష్ణా రెడ్డి, పోలీస్ సిబ్బందితో కలిసి హోంగార్డు నవీందర్‌ను శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఐ కృష్ణా రెడ్డి మాట్లాడుతూ, హోంగార్డు నవీందర్ గత సంవత్సరం కాలంగా జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో క్రమశిక్షణ, నిబద్ధత, బాధ్యతతో విధులు నిర్వహించారని ప్రశంసించారు. అప్పగించిన విధులను సమర్థవంతంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖకు సహకరించారని, విధి నిర్వహణలో మంచి పనితీరును కనబరిచారని అభినందించారు. అనంతరం హోంగార్డు నవీందర్ మాట్లాడుతూ, జగదేవ్‌పూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన కాలంలో అధికారులు సిబ్బంది అందించిన సహకారం, ప్రోత్సాహాన్ని ఎప్పటికీ మరచిపోలేనని తెలిపారు.

## స్పీకర్‌పై దుర్భాషలు ప్రజాస్వామ్యంపై దాడి:

**కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు**

**కరీంనగర్** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి వెలిచాల రాజేందర్‌రావు తీవ్రంగా ఖండించారు. దళితుడైన స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడటం ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడి చేయడమేనని అన్నారు. స్పీకర్‌ను ఏకవచనంతో సంబోధించడం అవమానకరమని పేర్కొన్న ఆయన, తాతా మధుపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ఆయన ఎమ్మెల్సీ సభ్యత్వాన్ని వెంటనే రద్దు చేయాలని శాసనమండలి చైర్మన్‌ను కోరారు.

## క్రీడల్లో విద్యార్థులు రాణించాలి




**గజ్వేల్ మున్సిపల్ చైర్ పర్సన్ చందన రవీందర్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

గజ్వేల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన మండల స్థాయి టోర్నమెంట్, సెలెక్షన్స్ కార్యక్రమంలో గెలుపొందిన విద్యార్థిని, విద్యార్థులకు గౌరవ మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్ బహుమతులు స్పాన్సర్ చేయడంతో పాటు స్వయంగా అందజేసి, విజేతలకు మెడల్స్‌ను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ చందన రవీందర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ ప్రతిభను కనబరచాలని, క్రీడల ద్వారా శారీరక దారుఢ్యంతో పాటు క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం పెంపొందుతాయని అన్నారు. విద్యార్థులు తమ ప్రతిభను మరింతగా మెరుగుపరుచుకుని ఉన్నత స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి కృష్ణ గారు, వైస్ చైర్ పర్సన్ కళ్యాణ్కర్ పద్మబాయి నర్సింగ్ గారు, టోర్నమెంట్ నిర్వహించిన పీఈటీ ఉపాధ్యాయులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## తాతా మధును మండలి నుంచి తొలగించాలి



**స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలి.. కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం**

**అగ్ని ధార న్యూస్ ,(పెద్దపల్లి) :**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును వెంటనే శాసనమండలి నుంచి తొలగించాలని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. స్పీకర్‌కు తాతా మధు క్షమాపణలు చెప్పాలని కోరుతూ ప్రభుత్వ విప్, పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు ఆదేశాల మేరకు సోమవారం పెద్దపల్లి నియోజకవర్గంలోని మండల, పట్టణ కేంద్రాల్లో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. ప్రధాన రహదారులపై బైఠాయించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ స్పీకర్‌పై ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలు తీవ్రంగా అభ్యంతరకరమని ఖండించారు. సభా మర్యాదలకు విరుద్ధంగా వ్యవహరించిన తాతా మధుపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దళిత స్పీకర్‌ను ఉద్దేశించి అసభ్య పదజాలం ఉపయోగించడం దురహంకారానికి పరాకాష్ట అని విమర్శించారు. రాజకీయ విమర్శలకు పరిమితులు ఉండాలని, స్పీకర్ పదవి, వ్యక్తిగత గౌరవానికి భంగం కలిగించేలా వ్యాఖ్యలు చేయడం సమర్థనీయం కాదన్నారు. స్పీకర్‌కు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్లు, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు, మార్కెట్ కమిటీ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, యువజన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నోటీసులు అందుకున్న ఓటర్లు పత్రాలు సమర్పించాలి

**50వ డివిజన్ కార్పొరేటర్ ధూళికట్ట సతీష్**

**అగ్ని ధార న్యూస్,( రామగుండం ) :**

ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు నిర్ణీత గడువులో అవసరమైన పత్రాలను సమర్పించాలని 50వ డివిజన్ కార్పొరేటర్, కాంగ్రెస్ పార్టీ పెద్దపల్లి జిల్లా సోషల్ మీడియా కోఆర్డినేటర్ ధూళికట్ట సతీష్ కోరారు. రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు సోమవారం వంకబెండు వెనుక ఉన్న వినాయక మండపం వద్ద 100, 101, 102 బూత్‌ల బీఎల్‌ఓలతో కలిసి ఓటర్ల నుంచి పత్రాలను స్వీకరించారు. నోటీసులు అందుకున్న ఓటర్లు సెప్టెంబరు 8, 9 తేదీల్లో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు వంకబెండు వెనుక వినాయక మండపం వద్ద అవసరమైన పత్రాలను అందజేయాలని సూచించారు. నోటీసులో పేర్కొన్న గడువులో పత్రాలు సమర్పించకపోతే ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ఓటర్లు ఎలాంటి ఆలస్యం చేయకుండా అవసరమైన పత్రాలతో హాజరై సహకరించాలని సతీష్ విజ్ఞప్తి చేశారు. పత్రాల సమర్పణలో నిర్లక్ష్యం వల్ల ఓటరు జాబితాలో జరిగే మార్పులకు బీఎల్ఏలు, బీఎల్ఓలను బాధ్యులను చేయవద్దని కోరారు.

## కాంగ్రెస్ ప్రభుత్వం బాకీ పడ్డ హామీలు అమలు చేయాలి



**రేవంత్ దిగిపో...అంటూ నిరసన**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ ఇంటింటికీ పంపిణీ చేసిన బీఆర్ఎస్ నాయకులు హామీలు అమలు చేయకపోతే ప్రజలే బుద్ధి చెబుతారు గ్రామ సర్పంచ్ నర్ర కనకయ్య అన్నారు, మండల పరిధిలోని పలుగు గడ్డ గ్రామం లో సోమవారం కాంగ్రెస్ ప్రభు త్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో పలుగు గడ్డ గ్రామంలో వినూత్న నిరసన చేపట్టారు. బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు పిట్టల అంజయ్య అధ్వర్యంలో ఇంటింటికీ 'బాకీ కార్డు'లను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రజలకు నెరవేర్చాల్సిన హామీలు, చెల్లించాల్సిన బకాయిల వివరాలను కార్డుల ద్వారా ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నర్ర కనకయ్య, గ్రామ అధ్యక్షులు పిట్టల అంజయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు గడుస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ హయాంలో జరిగిన అభివృద్ధి తప్ప కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి ప్రజలకు కనిపించడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన 6 గ్యారెంటీలను 1000 రోజుల పాలనలో అమలు చేయలేదని ఆరోపిస్తూ, ప్రజలకు ఎంత బాకీ పడ్డారో లెక్కలతో కూడిన కరపత్రాలను పంచారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ మహిళలకు నెలకు రూ. 2500 హామీతో 33 నెలలకు రూ. 82,500 బాకీ, వృద్ధులు, వితంతువులకు, బీడీ కార్మికులకు పెన్షన్ నెలకు రూ. 4000హామీతో 33 నెలలకు రూ. 66,000 బాకీ, దివ్యాంగులకు పెన్షన్ నెలకు రూ. 6000 హామీ 33 నెలలకు రూ. 66,000బాకీ కళ్యాణ లక్ష్మీ షాదీ ముబారక్ ఆడ బిడ్డల పెళ్లిళ్లకు తులం బంగారం బాకీ, ఈ విధంగా అనేక సంక్షేమ పథకాలు ఉన్నారని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే హామీలు నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి దేశంలోని తెలంగాణను నిలిపిన గొప్ప మహనీయులు తెలంగాణ రాష్ట్ర మాజీ సీఎం కేసీఆర్ ను విమర్శిస్తే కాంగ్రెస్ నాయకులకు పుట్టగతులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీపతి రాజేశ్వరి రవి, వార్డు సభ్యులు నర్ర కృష్ణ, బి అర్ ఎస్ పార్టీ గ్రామ ఉపాధ్యక్షులు లింగాల కనకయ్య, యూత్ అధ్యక్షులు చెక్కల క్రిష్ణ, గ్రామ మాజీ కో ఆప్షన్ సభ్యులు నర్ర కనకయ్య, గువ్వ రమేష్, మాజీ యూత్ అధ్యక్షులు చెక్కల కరుణాకర్, బి అర్ ఎస్ పార్టీ నాయకులు జహంగీర్, కనకయ్య, నర్సింలు, స్వామి , పాండు, తదితరులు పాల్గొన్నారు.

## తిమ్మాపూర్‌లో ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దహనం

**కరీంనగర్ :** తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ మండలశాఖ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శాసనసభాపక్ష నేత కేసీఆర్, ఆ పార్టీ ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా మండల కాంగ్రెస్ అధ్యక్షుడు బండారి రమేశ్ మాట్లాడుతూ రాజ్యాంగపరమైన స్పీకర్ పదవిలో ఉన్న గడ్డం ప్రసాద్ కుమార్ పరుషపదజాలంతో ధూషించడం ఆక్షేపణీ యన్నారు. స్పీకర్ కు భేషరతుగా ఎమ్మెల్సీ మధు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. దళితులంటేనే గిట్టని కేసీఆర్, మధు లాంటి వారి అహంకారాన్ని తగ్గించాలంటే శిక్ష

# చివరి ఆయకట్టు వరకు నీటిని అందించాల్సిందే

**రైతుల పంటలు ఎండితే ఉద్యమం తప్పదు**
**ఆయకట్టు రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకోవాలి**
**కేఎల్ఐ ద్వారా వెంటనే డిండి ప్రాజెక్టు పూర్తి స్థాయిలో నింపాలి**
**దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ డిమాండ్.**



**డిండి:** కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా డిండి ప్రాజెక్ట్ ను పూర్తిగా నింపి చివరి ఆయకట్టు వరకు నీటిని అందించి పంటలు కాపాడాలని దేవరకొండ మాజీ శాసనసభ్యులు రామావత్ రవీంద్ర కుమార్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు.డిండి మండల కేంద్రంలో సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మహాధర్నాను నిర్వహించారు.ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ .. నీళ్ల విషయంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ద్రోహం,మోసం చేస్తోందని తీవ్రంగా విమర్శించారు. డిండి ప్రాజెక్టును కెఎల్ఐ ద్వారా నింపి డిండి ఆయకట్టు రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కే ఎల్ ఐ ద్వారా డిండి ప్రాజెక్టును నింపిన ఘనత తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్కే దక్కుతుందని అన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సాగునీటి ప్రాజెక్టులకు ప్రాధాన్యత ఇచ్చి రైతులను రాజులుగా మార్చాని అన్నారు.ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం డిండి ప్రాజెక్టు ఆయకట్టు రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు.డిండి ప్రాజెక్టును పూర్తిగా నింపి రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటాన్ని కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ మహా ధర్నా కార్యక్రమంలోబిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రాజీనేని వెంకటేశ్వర రావు,రాష్ట్ర నాయకులు కేతావత్ బిల్యా నాయక్,నేనావత్ కిషన్ నాయక్,పిఏసీఎస్ చైర్మన్లు పల్లా ప్రవీణ్ రెడ్డి,మాధవరం శ్రీనివాస్ రావు,సర్పంచులు మల్ రెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి,కృష్ణయ్య, పట్టణ అధ్యక్షులు గిరమోని శ్రీను, బలుముల తిరుపతయ్య, రషీద్,రామావత్ వెంకట్రామ్,తండు వెంకటయ్య,బొడ్డుపల్లి జయంత్,తండు చంద్రయ్య, సుంకరి చంద్రయ్య,ఓర్సు ముత్యాలు,నాయకులు, కార్యకర్తలు,రైతులు భారీగా పాల్గొని విజయవంతం చేశారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం సొంత ఇంటి కల నెరవేర్చింది

**సీనియర్ నాయకులు దేశిని కోటి.**



**జమ్మికుంట,** జమ్మికుంట మున్సిపల్ పరిధిలో కొత్తపల్లి ఏరియాలో నాలుగో వార్డులో లాడే శ్యామ్ రావు, ఇందిరమ్మ గృహ ప్రవేశ కార్యక్రమాలలో పాల్గొన్న సీనియర్ కాంగ్రెస్ నాయకులు దేశిని కోటి,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాల నుండి ఇల్లు కట్టుకోవాలని తనకంటూ సొంత ఇల్లు ఉండాలని శ్యామ్ రావు కు ఆశ ఉండేది కానీ తన ఆర్థిక పరిస్థితుల వల్ల కట్టుకోలేకపోయారు, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత తనకు ఇందిరమ్మ ఇల్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రవేశపెట్టిన ఇందిరమ్మ ఇల్లు పథకం ద్వారా హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి వోడితల ప్రణవ్ బాబు సహకారంతో ఇల్లు మంజూరు కావడం జరిగింది, ఆరు నెలల్లోనే ఇల్లు కట్టుకొని సోమవారం రోజున గృహప్రవేశానికి మమ్మల్ని అందరినీ ఆహ్వానించి ముఖ్యమంత్రి చిత్రపటానికి పాలాభిషేకం చేసి నా కళ నెరవేర్చిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబుకు పాదాభివందనాలు అని కంటి తడి పెట్టిన శ్యామ్ రావు దంపతులు, నిరుపేద కుటుంబాలకు తప్పకుండా కాంగ్రెస్ ప్రభుత్వం అండగా ఉంటుంది మాటలు కాదు చేతుల్లో చూయించే ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం రానున్న రోజుల్లో ఇంకా ఎన్నో అభివృద్ధి పనులు కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అవుతుందని హుజురాబాద్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వోడితల ప్రణవ్ బాబు, నాయకత్వంలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇండ్లు కానీ డబుల్ బెడ్ రూములు కానీ సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు గాని పట్టణాలలో గ్రామాలలో అభివృద్ధి జరుగుతున్నాయి, అలాంటి గొప్ప నాయకున్ని మనందరం రానున్న రోజుల్లో దీవించాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దేశిని కోటి కోరారు. ఈ కార్యక్రమంలో 18 వ వార్డు కౌన్సిలర్ కుదాడి తిరుపతి,మాజీ కౌన్సిలర్ బొంగోని వీరన్న, పట్టణ కాంగ్రెస్ నాయకులు పంజాల అజయ్, నాలుగో వార్డ్ అధ్యక్షులు టెంకురాల కిషోర్, రాజేష్, లడే రామారావు, సాయినాథ్ యూత్ అసోసియేషన్ కందారపు రాజేష్, బలబత్తుల శ్రీకాంత్, గోపి, శ్రీధర్, సురేష్, తదితరులు పాల్గొన్నారు..

# మజ్లీస్‌తో రేవంత్ సంబంధం





**హైదరాబాద్ :** తెలంగాణ రాజకీయ ముఖచిత్రం మరో కీలక మలుపు తిరుగుతోందా? పాతబస్తీ రాజకీయాల నాడిని శాసించే మజ్లిస్ పార్టీ అధినేత, ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు అధికార, విపక్షాల్లో చర్చనీయాంశంగా మారాయి. సైదాబాద్ వద్ద నిర్మించిన నూతన స్టీల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ వేదిక ఇందుకు ప్రత్యక్ష సాక్ష్యంగా నిలిచింది. ఒకే వేదికపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ ఒకరిపై ఒకరు కురిపించుకున్న ప్రశంసలు కేవలం అభివృద్ధి సంకేతాలు మాత్రమే కావని, రాష్ట్ర రాజకీయాల్లో సరికొత్త సమీకరణాల ఆరంభానికి సూచికలని విశ్లేషకులు భావిస్తున్నారు.గతంలో తాము బీఆర్ఎస్ కి మద్దతు ఇచ్చిన విషయాన్ని అంగీకరించిన అసదుద్దీన్, తెరవెనుక జరిగిన ఒక కీలక హెచ్చరికను బయటపెట్టారు. “రేవంత్ రెడ్డి దూకుడును అడ్డుకోకపోతే మీరంతా ఇళ్లలోనే కూర్చోవాల్సి వస్తుందని నేను స్వయంగా కేసీఆర్‌కు పదే పదే చెప్పాను” అని వ్యాఖ్యానించడం ద్వారా గత ప్రభుత్వ పతనానికి రేవంత్ దూకుడే కారణమనే అంశాన్ని నొక్కిచెప్పారు. ఇది బీఆర్ఎస్ వైఫల్యాన్ని ఎత్తిచూపడమే కాకుండా, రేవంత్ రెడ్డి నాయకత్వ పటిమకు ఇచ్చిన భారీ సర్టిఫికెట్‌గా నిలిచింది.అసదుద్దీన్ ప్రసంగంలో అత్యంత కీలకమైన రాజకీయ కోణం.. పార్టీని కాదని రేవంత్ రెడ్డి వ్యక్తిత్వాన్ని ఆయన సమర్థించడం. “నేను మద్దతు ఇస్తున్నది రేవంత్ రెడ్డికి మాత్రమే, కాంగ్రెస్ పార్టీకి కాదు” అని కుండబద్దలు కొట్టారు. సాధారణంగా ఎంఐఎం అధికారంలో ఉన్న పార్టీలతో సత్సంబంధాలు నెరపుతుందనే ఒక ముద్ర ఉంది. అయితే ఈసారి అసదుద్దీన్ కాంగ్రెస్ హైకమాండ్‌కు లేదా హస్తం పార్టీ సిద్ధాంతాలకు కాకుండా, నేరుగా సీఎం రేవంత్ రెడ్డి పాలనా శైలికే తమ బాసట అని స్పష్టం చేశారు. రేవంత్ రెడ్డి సారథ్యంలో హైదరాబాద్ సహా సమగ్ర తెలంగాణ శరవేగంగా అభివృద్ధి చెందాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. అంతేకాదు, రేవంత్ రెడ్డి మరీ ఎక్కువ మర్యాదస్తుడిగా మారిపోయారని, గతంలో మాదిరి దూకుడును ప్రదర్శిస్తూ ప్రజల్లోకి రావాలని హితవు పలికారు.మరోవైపు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సైతం అసదుద్దీన్ ఓవైసీ, అక్బరుద్దీన్ ఓవైసీలపై ప్రశంసల జల్లు కురిపించారు. దేశభక్తి విషయంలో ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షాలకు అసదుద్దీన్ ఏమాత్రం తీసిపోరని రేవంత్ తేల్చిచెప్పారు. కొందరు కావాలనే అసద్‌పై, ఎంఐఎంపై దేశద్రోహ ముద్ర వేసే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. అంతర్జాతీయ స్థాయిలో అసదుద్దీన్‌కు ప్రత్యేక గుర్తింపు ఉందన్న రేవంత్, ఓల్డ్ సిటీ సమగ్ర పురోగతికి కట్టుబడి ఉన్నామని ప్రకటించారు. తాను సీఎం అయ్యాక ఓవైసీ సోదరులతో పాతబస్తీ అభివృద్ధి ప్రణాళికలపై చర్చించానని గుర్తుచేశారు. పాతబస్తీ సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి పనులకు సంబంధించి ఎంపీ అసద్ ఇచ్చే ఏ ప్రతిపాదనలనైనా తక్షణమే పరిశీలించి నిధులు విడుదల చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్‌ను ఆ వేదికపైనే రేవంత్ ఆదేశించారు.కాంగ్రెస్ పార్టీని పక్కనపెట్టి కేవలం రేవంత్ రెడ్డికే మద్దతు ప్రకటించడం ద్వారా అసదుద్దీన్ వ్యూహాత్మకంగా వ్యవహరించారు. ఇది ఒకవైపు కాంగ్రెస్‌తో తాము పూర్తిగా కరిగిపోలేదని మజ్లిస్ క్యాడర్‌కు స్పష్టం చేస్తూనే, మరోవైపు ప్రభుత్వ సారథి అయిన రేవంత్‌తో తమ బంధం అత్యంత పటిష్టంగా ఉందనే సందేశాన్ని ఇచ్చింది. అటు రేవంత్ రెడ్డి కూడా హైదరాబాద్ రాజకీయంలో పాతబస్తీ మద్దతును సంపూర్ణంగా తన ఖాతాలో వేసుకుంటూ, ప్రభుత్వంలో తన పట్టును, ఇమేజ్‌ను మరింత పటిష్టం చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు గట్టి హెచ్చరిక పంపడమే కాక, హైదరాబాద్ వేదికగా తిరుగులేని రాజకీయ శక్తిగా తాము కొనసాగుతామని రేవంత్-ఓవైసీల ద్వయం ఈ సభ ద్వారా చాటిచెప్పింది.

## కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీల అమలను ప్రజా వాణిలో బి ఆర్ ఎస్ నాయకుల పిర్యాదు

**కాంగ్రెస్ హామీలు అమలు చేయాలనీ బి ఆర్ ఎస్ నాయకుల డిమాండ్**

**అగ్నిధార న్యూస్ సిద్దిపేట జిల్లా**

జగదేవపూర్ మండల కేంద్రమలో నీ స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో బి ఆర్ ఎస్ నాయకులు పెద్ద ఎత్తున కార్యకర్తలతో వచ్చి సోమవారం ప్రజా వాణి కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలనీ వినతిపత్రం ఎంపీడీఓ వేణు గోపాల్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్బంగా బి ఆర్ ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు పదమూడు డిక్లరేషన్లు ఆరు గ్యారంటీ లపేరుతొ నమ్మించి అధికారంలోకి వచ్చిందని వంద రోజుల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చలేదనీ చెప్పి వెయ్యి రోజులు పూర్తి అయిన ఇప్పటి దాక ఒక్క హామీ పూర్తి గా అమలు కాలేదని అందువల్ల మా కుటుంబాల్లో అర్హులకు ప్రయోజనలు అందజేయాలనీ డిమాండ్ చేశారు. అదేవిధంగా ఆడబిడ్డలకు మహా లక్ష్మి పథకం ద్వారా నెలకు రూ. 2500 వందలు ఆర్థిక సహాయం, తులం బంగారం స్కూటీ అందించాలని ఆడబిడ్డలకు రక్షన కలిపించాలి. రైతు సోదరులకు ప్రతి పంటకు రైతు భరోసా కొరత లేకుండా ఎరువులు పంపిణీ పంటలకు బోనస్ 24 గంటల కరెంటు విద్యుత్ సరఫరా అందజేయాలని రైతు కూలీలకు సంవత్సరానికి 12 వేల రూపాయల సహాయం అందజేయాలి. అర్హులైన నిరుద్యోగ యువతి యువకులకు నిరుద్యోగ భృతి ఉద్యోగం జాబు క్యాలెండర్ అమలు చేయాలి. విద్యార్థులకు విద్యా భరోసా పెండింగ్ ఫీజులు చెల్లించాలి. వృద్ధులు వితంతువులు దివ్యాంగులకు బీడీ కార్మికులకు పెంచిన 4 వేల పింఛను అమలు చేయాలి. ఆటో అన్నలకి ఏడాదికి 12,000 అందజేయాలి. బీసీ ఎస్సీ ఎస్టీ మైనార్టీ విద్యార్థి యువకులకు రైతులకు వంటి వర్గాలకు ఇచ్చిన అన్ని అమలు చేయాలి. గ్రామాలు పట్టణాలలో పారిశుధ్య నిర్వహణ ఆగిపోయి మురికి కంపుతో మునిగిపోయాయని వెంటనే పారిశుధ్య నిర్వహణ చేపట్టాలని డిమాండ్ చేశారు. హామీలను అడిగితే అక్రమ కేసులు పెడుతున్నారు వీటిని వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఇంద్రసేనారెడ్డి గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రాచమల్ల ఉపేందర్ రెడ్డి జంబుల శ్రీనివాస్ రెడ్డి మండల ఉద్యమకారుల సంఘం అధ్యక్షుడు ఆలేటి లోలాకర్ రెడ్డి అంకిల్ల యాదవ్ రెడ్డి మాజీ మండల కో ఆప్షన్ సభ్యులు సయ్యద్ ఇక్బాల్ పిఎసిఎస్ డైరెక్టర్ భూమయ్య మాజీ ఎంపిటిసి కొత్త కవిత శ్రీనివాస్ రెడ్డి సర్పంచులు రాచమల్ల ఎలేష్ చెక్కల పరమేశ్వర్ క్యాసారం కుమార్ యశ్వంత్ రెడ్డి ఉప సర్పంచ్ల ఫోరం అధ్యక్షుడు కంచర్ల స్వామి పోకల రాశీచంద్రశీ మచ్చేందర్ రెడ్డి కొంపల్లి మహేష్ కేశమైన మహేందర్ యాదవ్ మాజీ ఎంపిటిసి కావ్య దర్గయ్య మాజీ ఉప సర్పంచ్ జూపల్లి భాస్కర్ శ్రీనివాస్ రెడ్డి కర్రీ యాదగిరి టిఆర్ఎస్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## నేటి నుండి మంథని జోనల్ లెవెల్ క్రీడా పోటీలు



**అగ్నిధార న్యూస్ మంథని :**

మంథని జోనల్ లెవెల్ క్రీడా పోటీలు సెప్టెంబర్ 8, 9, 11వ తేదీల్లో జరుగుతాయని ఎస్ జి ఎఫ్ మంథని జోన్ అధ్యక్షులు ఎంఈఓ దాసరి లక్ష్మి తెలియజేశారు. సెప్టెంబర్ 8 రోజున మంథని జోన్ కు సంబంధించినటువంటి ముత్తారం, రామగిరి, మంథని రూరల్, అర్బన్ క్రీడాకారులకు, బాలికలకు అండర్ 14, అండర్ 17 విభాగాలలో కబడ్డీ , ఖో-ఖో, వాలీబాల్ విభాగాలలోపోటీలు జరుగుతాయని, సెప్టెంబర్ 9వ తేదిన బాలురకు అండర్ 14, 17 విభాగాల్లో కబడ్డీ,ఖో-ఖో వాలీబాల్ విభాగాల్లో పోటీలు జరుగుతాయని తెలియజేశారు.నాలుగు మండలాలకు సంబంధించినటువంటి బాల బాలికలకు అథ్లెటిక్స్ విభాగాల్లో సెప్టెంబర్ 11వ తేదీన పోటీలో నిర్వహించబడతాయని తెలిపారు. క్రీడల్లో పాల్గొనదలచిన విద్యార్థులు, ఉపాధ్యాయులు నాలుగు మండలాల సంబంధించినటువంటి ఎస్జీఎఫ్ సెక్రటరీలు, ఫోటోతో కూడిన ఎలిజిబులిటీ ఫారం తీసుకొని 9 గంటలకు గవర్నమెంట్ పాఠశాల మంథని క్రీడా మైదానంలో జోన్ సెక్రటరీ సమ్మయ్య కు రిపోర్ట్ చేయగలరని ఎస్ జి ఎఫ్ మంథని జోన్ అధ్యక్షులు ఎంఈఓ దాసరి లక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రజల నుండి వినతులు స్వీకరించిన ఆర్డీవో



**భూ వివాదాలపై 3, వృద్ధుల సమస్యలపై 2 దరఖాస్తులు స్వీకరణ.**
**ప్రతి సోమవారం ప్రజావాణి నిర్వహణ**

**అగ్నిధారన్యూస్ పెద్దపల్లి**

పెద్దపల్లి రెవెన్యూ డివిజనల్ కార్యాలయంలో సోమవారం రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్డీవో) గంగయ్య అధ్యక్షతన ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి డివిజన్ స్థాయి అధికారులు హాజరయ్యారు. ప్రజల నుండి వినతులను స్వీకరించారు.ప్రజావాణిలో భూ వివాదాలకు సంబంధించిన మూడు దరఖాస్తులు, వృద్ధులకు సంబంధించిన రెండు దరఖాస్తులు వచ్చాయని ఆర్డీవో తెలిపారు. ఈ సందర్భంగా ఆర్డీవో గంగయ్య మాట్లాడుతూ... డివిజన్ స్థాయిలో ప్రతి సోమవారం ప్రజావాణి కార్యక్రమం జరుగుతుందని, డివిజన్ పరిధిలోని ప్రజలు తమ సమస్యలను పరిష్కరించుకోవడానికి ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## బైక్ దొంగల ఆటకు పోలీసుల చెక్..

**నరసరావుపేట:** నరసరావుపేట పట్టణంలో వరుసగా జరుగుతున్న మోటార్ సైకిల్ దొంగతనాలకు పోలీసులు చెక్ పెట్టారు. ప్రత్యేక దృష్టి సారించి సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన నరసరావుపేట 1వ పట్టణ పోలీసులు ప్రధాన నిందితుడిని అరెస్ట్ చేసి, అతని వద్ద నుంచి 22 దొంగిలించబడిన మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.14 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు.నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు ఆదేశాల మేరకు నరసరావుపేట 1వ పట్టణ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ క్రమంలో ప్రధాన నిందితుడైన ×యన్నబత్తుని మణికంఠ (22) ను సెప్టెంబర్ 6న సాయంత్రం 6.30 గంటలకు నరసరావుపేట టౌన్ ఫస్ట్ గేట్ నుంచి షాలేం నగర్ వైపు వెళ్లే రహదారిలో అరెస్ట్ చేశారు.మార్చి నుంచి ఆగస్టు వరకు వరుస దొంగతనాలు..పోలీసుల విచారణలో నిందితుడు 2026 మార్చి నుంచి ఆగస్టు వరకు నరసరావుపేట పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసిన మోటార్ సైకిళ్లను దొంగిలించినట్లు వెల్లడించినట్లు పోలీసులు తెలిపారు.

Printed Published Edited and Owned by Chegonda Ravikumar Yadav.Printed at Sri Laxmi Printing Press H.NO.4_6_157 Peddapalli Pin co.505172 State Telangana
TITLE CODE:TELTEL02040 EDITOR: Chegonda Ravikumar Yadav Contact Number.8008817828. Email.agnidharanews@gmail.com http://www.agnidharanews.com